# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 227 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | మంగళవారం 07 అక్టోబర్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 227 07-10-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


## టమోటా రైతులకు అండగా ఉంటాం

**రైతులు ఆందోళన చెందొద్దని హామీ ఇచ్చిన మంత్రి అచ్చెన్నాయుడు**



**అమరావతి అక్టోబర్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు టమోటా ధరలపై రైతులకు భరోసా ఇచ్చారు. ఏవైనా ఇబ్బందులు తలెత్తినపుడు, రైతులకు ఎటువంటి నష్టం కలగకుండా ప్రభుత్వం అన్ని

- తరువాయి 2లో..




## 2025 వైద్యశాస్త్రంలో ముగ్గురికి నోబెల్ బహుమతి

**మేరీ ఇ.బ్రున్‌కో, ఫ్రెడ్ రామ్స్‌డెల్, షిమన్ సకాగుచీకి ప్రతిష్ఠాత్మక పురస్కారం**

**న్యూఢిల్లీ అక్టోబర్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

వైద్య శాస్త్రంలో విశేష కృషి చేసినందుకు గాను ప్రముఖ శాస్త్రవేత్తలు మేరీ ఇ.బ్రున్‌కో, ఫ్రెడ్ రామ్స్‌డెల్, షిమన్ సకాగుచీకి అత్యంత ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారం లభించింది. వైద్య విభాగంతో ప్రారంభమైన నోబెల్ పురస్కారాల ప్రకటనలు ఈ నెల 13వ తేదీ వరకు కొనసాగుతాయి. మానవ శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ తన సొంత అవయవాలపై దాడి చేయకుండా ఎలా నిరోధించబడుతుందనే రహస్యాన్ని ఛేదించినందుకు గాను వీరికి ఈ పురస్కారం లభించింది. వీరి పరిశోధనలు పెరిఫెరల్ ఇమ్యూన్ టాలరెన్స్ అనే విధానంపై దృష్టి సారించాయి. దీని ద్వారా నియంత్రిత టీ కణాలుగా పేర్కొనబడే ప్రత్యేక రోగనిరోధక కణాలు ఆటోఇమ్యూన్ వ్యాధుల నుంచి శరీరాన్ని రక్షించే సంరక్షకులుగా ఎలా పనిచేస్తాయో వారు తమ పరిశోధనలు గుర్తించారు.

## విద్యార్థుల కలలకు రెక్కలు తొడుగుదాం



**పావలా వడ్డీకే అందరికీ విదేశీ విద్యా రుణాలు**

**విదేశాల్లో చదవాలనుకునేవారికి ప్రభుత్వ హామీ**

**అన్ని హాస్టళ్లను రెసిడెన్షియల్ స్కూళ్లుగా మార్చడమే లక్ష్యం**

**సంక్షేమ శాఖలదే 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్' అమలు బాధ్యత**

**సంక్షేమ శాఖల సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

**అమరావతి అక్టోబర్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రాష్ట్రంలోని విద్యార్థులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరో వరం ఇవ్వాలని నిర్ణయించారు. విదేశాల్లో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదవాలనుకునే ప్రతీ విద్యార్థికి పావలా వడ్డీకే బ్యాంకు రుణాలు ఇచ్చేలా సరికొత్త పథకాన్ని రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎలాంటి పరిమితి లేకుండా, ఎంతమంది విద్యార్థులైనా చదువుకునే వీలుండాలని చెప్పారు. అలాగే దేశంలో ఐఐటీ, ఐఐఎం నీట్ వంటి ఉన్నత విద్య చదవాలనుకునే వారికి కూడా ఈ పథకం వర్తింప చేయాలని

- తరువాయి 2లో..








## మోగిన బీహార్ ఎన్నికల నగారా

**న్యూఢిల్లీ అక్టోబర్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల నగారా మోగింది. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) సోమవారం విడుదల చేసింది. రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నట్లు తెలిపింది. నవంబర్ 6, 11తేదీల్లో ఎన్నికలు జరగనున్నాయని, ఓట్ల లెక్కింపు నవంబర్ 14న జరగనుంది. బీహార్‌లో మొత్తం 243 శాసనసభ స్థానాలు ఉన్నాయి. ప్రస్తుత అసెంబ్లీ గడువు నవంబర్ 22తో

- తరువాయి 2లో..

## అక్టోబర్ 07న రాష్ట్ర పండుగగా వాల్మీకి జయంతి

**రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**

**కర్నూలులో రాష్ట్రస్థాయి జయంతోత్సవం**

**తరలిరానున్న మంత్రులు, ప్రజాప్రతినిధులు**

**అమరావతి అక్టోబర్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అక్టోబర్ న మహర్షి వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా రాష్ట్ర వ్యాప్తంగా

- తరువాయి 2లో..



## నేను ఓడిపోయినప్పుడు జస్టిస్ గోపాల గౌడ వెన్నుతట్టి ధైర్యం చెప్పారు



**కర్ణాటక, అక్టోబర్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

చింతామణి (కర్నాటక) : 2019లో తాను ఓడిపోయిన సమయంలో జస్టిస్ గోపాల గౌడ వెన్నుతట్టి ధైర్యం చెప్పారని ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. భాష, ప్రాంతంపరంగా వేరుగా ఉన్నా %% సంస్కృతి-సంప్రదాయాల విషయంలో కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య మంచి సంబంధ బాంధవ్యాలున్నాయన్నారు. కర్నాటకలోని చింతామణిలో జరిగిన సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాల గౌడ 75 వ పుట్టినరోజు వేడుకల్లో పవన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ %% కోలార్, చిక్కబళ్లాపుర ప్రాంతాల్లో నీటి సమస్య పరిష్కారానికి తమ వైపు నుంచి సహకారం అందిస్తామన్నారు. రూల్ ఆఫ్ లా స్థాపనలో నేటి తరానికి జస్టిస్ గోపాల గౌడ దారి చూపాలని కోరారు. తన వత్తి జీవితాన్ని కార్మికులు, కర్షకుల కోసం అంకితం చేశారని, ఎన్నో కీలక కేసుల్లో ఆయన ఇచ్చిన తీర్పులు చరిత్రాత్మకమని గుర్తుచేశారు. భూ సేకరణ చట్టంతో ఇబ్బందులు పడేవారి పక్షాన నిలిచారని, ఏ ప్రభుత్వం రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడినా అడ్డుకున్నారని తెలిపారు. జనసేన చేపట్టిన పోరాటాల్లో జస్టిస్ గోపాల గౌడ ఇచ్చిన సలహాలు ఎంతో ఉపయోగపడ్డాయని, 2019లో తాను ఓడిపోయిన సమయంలో వెన్నుతట్టి ధైర్యం చెప్పారని గుర్తు చేసుకున్నారు. ఎపిలో పంట పొలాలు నాశనం కాకుండా కర్నాటక ప్రభుత్వం కుంకీ ఏనుగులు ఇచ్చి సహకరించిందని గుర్తు చేసుకున్నారు. శ్రీశైలం దేవస్థానానికి వచ్చే కర్నాటక యాత్రికులకు సౌకర్యాల విషయంలో సానుకూలంగా ఉన్నామని తెలిపారు. జస్టిస్ వి.గోపాల గౌడ మాట్లాడుతూ

- తరువాయి 2లో..




## తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాలకు బాంబు బెదిరింపు

**నేడు తిరుపతి వస్తున్న సీఎం చంద్రబాబు**

**ఎస్వీ అగ్రి కాలేజి వద్ద హెలిప్యాడ్ ఏర్పాటు**

**హెలిప్యాడ్ వద్ద 5 బాంబులు అమర్చినట్టు ఈమెయిల్ బెదిరింపు**

**అప్రమత్తమైన పోలీసులు... విస్తృతంగా తనిఖీలు చేసిన బాంబు స్క్వాడ్**

**తిరుమల అక్టోబర్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ప్రముఖ ఆధ్యాత్మిక నగరం తిరుపతిలోని ఎస్వీ అగ్రికల్చర్ కాలేజీకి బాంబు బెదిరింపు వచ్చింది. సీఎం చంద్రబాబు పర్యటన కోసం కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద 5 ఆర్డీఎక్స్ ఐఈడీ బాంబులు పెట్టినట్టు ఆ బెదిరింపు ఈమెయిల్ లో హెచ్చరించారు.

- తరువాయి 2లో..



## ఏపీలో మరిన్ని పెట్టుబడులు పెట్టే అంశాన్ని పరిశీలించండి

**ముంబయిలో టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్‌తో మంత్రి నారా లోకేశ్ సమావేశం**

**ఐటీ, ఈవీ, ఏరోస్పేస్, పునరుత్పాదక ఇంధన రంగాల్లో పెట్టుబడులకు ఆహ్వానం**

**విశాఖ, శ్రీసిటీ, మచిలీపట్నంలలో యూనిట్ల ఏర్పాటుకు కీలక ప్రతిపాదనలు**


**ముంబాయి, అక్టోబర్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ నేడు ముంబయిలో టాటా గ్రూప్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్‌తో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలను వివరిస్తూ, పలు రంగాల్లో టాటా గ్రూప్ భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు. ఏపీలో మరిన్ని పెట్టుబడులు పెట్టే అంశాన్ని పరిశీలించండి అని విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో టాటా గ్రూప్‌కు

- తరువాయి 2లో..

## మేధోమధనంతో... మరింత మెరుగైన సేవలు

- పౌర సేవల్లో సంతృప్తి స్థాయే ముఖ్యం
- ప్రభుత్వ శాఖల పనితీరుపై నెలవారీ ఆడిట్ జరగాలి
- వాట్సప్ గవర్నెన్స్ వినియోగం మరింత పెరగాలి
- ఆర్టీజీఎస్, పౌర సేవలపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- డ్రోన్ సిటీకి ప్రధాని మోదీ చేతుల మీదుగా శంకుస్థాపన
- డిసెంబరులో డ్రోన్ షో నిర్వహించాలని నిర్ణయం



**అమరావతి అక్టోబర్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

వివిధ ప్రభుత్వ శాఖలు అందిస్తున్న పౌర సేవలు మరింత మెరుగు పరిచేందుకు అధికారులు మేధోమధనం జరపాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. పౌర సేవల్లో

- తరువాయి 2లో..






## కేంద్రసాయం, రాష్ట్ర సహకారంతో గాడిన పడుతున్న విశాఖ స్టీల్ ప్లాంట్

**ఏడాదిలో 25 శాతం నుంచి 79 శాతానికి చేరిన కెపాసిటీ యుటిలైజేషన్**

**స్టీల్ ప్లాంట్ బలోపేతానికి పూర్తి సహకారం... గరిష్ట సామర్థ్యం సాధించాలి**

**విశాఖ స్టీల్ పై రివ్యూలో అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచన**

**అమరావతి అక్టోబర్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

విశాఖ ఉక్కు కర్మాగారం పటిష్టతకు, పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఏడాది కాలంలో కేంద్ర సాయం, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ప్లాంట్ ఉత్పత్తిలో గణనీయమైన పురోగతి వచ్చిందని... ఇది ఆహ్వానించదగిన పరిణామంగా సిఎం అన్నారు. ప్లాంట్‌ని నష్టాల నుంచి బయటపడేయడానికి, బలోపేతం చేయడానికి యాజమాన్యం, కార్మికులు, ఉద్యోగులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాల్సి ఉందన్నారు. గత ఏడాది కాలంలో తీసుకున్న చర్యలు, సమిష్టి నిర్ణయాలు, సమన్వయం కారణంగా ప్లాంట్ మంచి ఫలితాలు సాధిస్తోందని సిఎం

- తరువాయి 2లో..

## కల్తీ మద్యం కేసు .. ఇద్దరు టీడీపీ నేతలపై సస్పెన్షన్ వేటు

- కల్తీ మద్యం వ్యవహారంపై కీలక నిర్ణయం తీసుకున్న టీడీపీ అధిష్ఠానం
- తంబళ్లపల్లి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి, స్థానిక నేత సురేంద్ర నాయుడుల సస్పెన్షన్
- ప్రకటన విడుదల చేసిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



**అన్నమయ్య అక్టోబర్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అన్నమయ్య జిల్లా ములకలచెరువు కల్తీ మద్యం తయారీ వ్యవహారంపై తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న తెలుగుదేశం పార్టీ నాయకులపై కఠిన చర్యలు చేపట్టింది. ఈ కేసులో ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వచ్చిన తంబళ్లపల్లి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్?ఛార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి, స్థానిక తెలుగుదేశం పార్టీ నేత కట్టా సురేంద్ర నాయుడులను

- తరువాయి 2లో..

## ముంబైలో ట్రాఫిగురా సీఈవో సచిన్ గుప్తాతో మంత్రి నారా లోకేశ్ భేటీ!

**అమరావతి అక్టోబర్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్‌లో పోర్టు ఆధారిత మౌలిక సదుపాయాల రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టాలని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రపంచ వాణిజ్య దిగ్గజ సంస్థ


- తరువాయి 2లో..



### ఈ నెల 13న ఏపీ సీఎం చేతుల మీదుగా

# సీఆర్డీఏ ప్రధాన కార్యాలయం ప్రారంభోత్సవం

**ముమ్మరంగా సాగుతున్న సీఆర్డీఏ ప్రధాన కార్యాలయ భవన నిర్మాణ పనులు**
**ఈ నెల 11వ తేదీ నాటికి భవనాన్ని స్వాధీనం చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశాలు**
**ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న సీఆర్డీఏ ప్రధాన కార్యాలయం**




అమరావతి అక్టోబర్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏపీ రాజధాని అమరావతిలో సీఆర్డీఏ ప్రధాన కార్యాలయ నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. తుది దశకు చేరుకున్న ఈ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. మిగిలిన కొద్దిపాటి పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్నారు. ఈ నెల 13న కార్యాలయాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. భవన ప్రారంభోత్సవాన్ని విజయదశమికి నిర్వహించాలని తొలుత భావించినప్పటికీ, వర్షాల కారణంగా పనులు ఆలస్యమయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 11వ తేదీ నాటికి అన్ని పనులు పూర్తి చేసి భవనాన్ని స్వాధీనం చేయాలని కాంట్రాక్టర్‌ను అధికారులు ఆదేశించారు. నూతన కార్యాలయ భవనాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తారు. ఈ కార్యాలయంలో సీఆర్డీఏ, ఏడీసీఎల్ (అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్), సీడీఎంఏ కార్యాలయాలతో పాటు పురపాలక శాఖ మంత్రి నారాయణ, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఛాంబర్‌లు ఉంటాయి. అమరావతిలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయ భవనం పూర్తి కానందున అధికారులు ఇప్పటి వరకు విజయవాడ లెనిన్ సెంటర్‌లోని కార్యాలయం నుండి కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు.

# ప్రపంచానికే ఆదర్శంగా భారత్.. కుష్టు వ్యాధికి చెక్

- **కుష్టు వ్యాధి నియంత్రణలో భారత్‌కు చారిత్రక విజయం**
- **గత 44 ఏళ్లలో 99 శాతం మేర తగ్గిన వ్యాప్తి రేటు**
- **39 లక్షల నుంచి 82 వేలకు పడిపోయిన రోగుల సంఖ్య**
- **మల్టీడ్రగ్ థెరపీ, ప్రభుత్వ కార్యక్రమాలతో గొప్ప ఫలితాలు**
- **2030 నాటికి వ్యాధి వ్యాప్తిని పూర్తిగా అరికట్టడమే లక్ష్యం**




కుష్టు వ్యాధి నియంత్రణలో భారతదేశం అద్భుతమైన, చారిత్రక విజయాన్ని సాధించింది. గత 44 సంవత్సరాలలో కుష్టు వ్యాధి వ్యాప్తి రేటును 99 శాతం మేర తగ్గించగలిగినట్లు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది. పటిష్ఠమైన ప్రభుత్వ కార్యక్రమాలు, సమర్థవంతమైన చికిత్సా విధానాలతో ఒకప్పుడు పెనుసవాలుగా ఉన్న ఈ వ్యాధిని దాదాపు నిర్మూలన స్థాయికి తీసుకురావడం భారత ప్రజారోగ్య రంగంలో ఒక గొప్ప మైలురాయిగా నిలిచింది. ప్రభుత్వం విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, 1981లో దేశంలో ప్రతి 10,000 మంది జనాభాకు 57.2గా ఉన్న వ్యాప్తి రేటు, 2025 నాటికి కేవలం 0.57కు పడిపోయింది. ఇదే కాలంలో చికిత్స పొందుతున్న రోగుల సంఖ్య 39.19 లక్షల నుంచి 82 వేలకు (98 శాతం తగ్గుదల) క్షీణించింది. ఈ గణాంకాలు కుష్టు వ్యాధిపై భారత్ చేసిన తిరుగులేని పోరాటానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

**'ఎండీటీ' కీలక పాత్ర..**

1983లో మల్టీడ్రగ్ థెరపీ (ఎండీటీ) ప్రవేశపెట్టడం ఈ విజయంలో కీలక పాత్ర పోషించిందని ప్రభుత్వం పేర్కొంది. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమం (ఎన్ఎల్ఈపీ) కింద వ్యాధిని ముందుగానే గుర్తించడం, ఉచితంగా ఎండీటీ మందులను నిరంతరాయంగా సరఫరా చేయడం వంటి చర్యలు సత్ఫలితాలనిచ్చాయి. దీని ఫలితంగా 2005 మార్చి నాటికే జాతీయ స్థాయిలో కుష్టు వ్యాధి నిర్మూలన లక్ష్యాన్ని (ప్రతి 10,000 మందికి ఒకరి కంటే తక్కువ కేసులు) భారత్ సాధించింది. ప్రభుత్వ నిబద్ధత, నిరంతర పర్యవేక్షణ, సమాజ భాగస్వామ్యం వంటివి ఈ కార్యక్రమ విజయానికి మూల కారణాలని ప్రభుత్వ ప్రకటన వివరించింది. మార్చి 2025 నాటికి దేశంలోని 31 రాష్ట్రాలు, 638 జిల్లాలు నిర్మూలన లక్ష్యాన్ని చేరుకున్నాయి. ప్రస్తుతం ఆయుష్మాన్ భారత్, రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం వంటి పథకాలలో కుష్టు వ్యాధి స్క్రీనింగ్‌ను కూడా అనుసంధానం చేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాలకు అనుగుణంగా 2030 నాటికి కుష్టు వ్యాధి వ్యాప్తిని పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

# బెంగళూరులో పవన్ కళ్యాణ్‌కు ఘనస్వాగతం

**కర్ణాటక పర్యటనకు వెళ్లిన ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**
**జస్టిస్ గోపాల గౌడ అమృత మహోత్సవంలో పాల్గొనేందుకు రాక**
**బెంగళూరు హెచ్ఏఎల్ విమానాశ్రయానికి చేరుకున్న పవన్**
**పవన్‌కు స్వయంగా స్వాగతం పలికిన జస్టిస్ గోపాల గౌడ**
**ఆహ్వానం పలికిన వారిలో కోలార్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్**

బెంగుళూరు, అక్టోబర్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)







ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కర్ణాటక పర్యటనలో భాగంగా బెంగళూరు చేరుకున్నారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వి. గోపాల గౌడ నిర్వహిస్తున్న అమృత మహోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనకు బెంగళూరులోని హెచ్ఏఎల్ విమానాశ్రయంలో ఆత్మీయ స్వాగతం లభించింది. ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా పవన్ కల్యాణ్‌ను ఆహ్వానించిన జస్టిస్ గోపాల గౌడ స్వయంగా విమానాశ్రయానికి వచ్చి ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. ఆయనతో పాటు కోలార్ నియోజకవర్గ ఎమ్మెల్యే ఎం. మల్లేశ్ బాబు, కర్ణాటక శాసనసభ మాజీ ఉప సభాపతి ఎం. కృష్ణా రెడ్డి కూడా ఉప ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. వీరితో పాటు అనితా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్. యుధిష్ఠర, లియో క్లబ్ ఆఫ్ మార్గ అధ్యక్షుడు నవీన్ జి కృష్ణ తదితరులు పవన్ కల్యాణ్‌కు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. కర్ణాటకలోని చిక్కబళ్లాపూర్ జిల్లా చింతామణి పట్టణంలో జస్టిస్ వి. గోపాల గౌడ అమృత మహోత్సవాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ వేడుకల్లో పాల్గొనేందుకే పవన్ కల్యాణ్ బెంగళూరు వచ్చారు. విమానాశ్రయం నుంచి ఆయన నేరుగా చింతామణిలో జరిగే కార్యక్రమానికి బయలుదేరి వెళ్లారు.

# రేబిస్ వ్యాధి కలకలం..
# హైదరాబాద్‌లో బాలుడు మృతి



హైదరాబాద్, అక్టోబర్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తెలుగు రాష్ట్రాల్లో రేబిస్ కలకలం సృష్టిస్తోంది. హైదరాబాద్‌లో రేబిస్ వ్యాధితో ఒక బాలుడు మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది. జనగామ జిల్లా పాలకుర్తి మండలం వావిలాలకు చెందిన మైదం శ్రీనివాస్ కుటుంబం జీవనోపాధి కోసం కొంతకాలం క్రితం హైదరాబాద్‌కు వలస వచ్చింది. ప్రస్తుతం ఈ కుటుంబం మాదాపూర్‌లో నివాసం ఉంటోంది. రెండు నెలల క్రితం శ్రీనివాస్ కుమారుడు శ్రీచరణ్‌ను కుక్క కరిచింది. వెంటనే అతనికి ఇంజక్షన్ కూడా చేయించారు. అయితే రెండు రోజుల క్రితం శ్రీచరణ్ అనారోగ్యానికి గురికావడంతో తల్లిదండ్రులు తార్నాకలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీచరణ్ మృతి చెందాడు.

# భారత నేవీలోకి కొత్త యుద్ధ నౌక

**విశాఖలో 'ఆంద్రోత్' నౌక జాతికి అంకితం**
**భారత నౌకాదళం స్వదేశీకరణలో మరో మెట్టు**
**లక్షద్వీప్ ద్వీప సమూహంలోని ఓ ద్వీపం పేరు ఈ నౌకకు**

విశాఖపట్నం అక్టోబర్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



భారత నౌకాదళం స్వదేశీకరణ ప్రయత్నాల్లో మరో మైలురాయిని అధిగమించింది. విశాఖ నేవల్ డాక్‌యార్డ్‌లో సోమవారం భారత నౌకాదళానికి చెందిన రెండో యాంటీ-సబ్‌మెరైన్ వార్‌ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్ (ASW-SWC) నౌక 'ఆంద్రోత్'ను వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధర్కర్ జాతికి అంకితం చేశారు. సముద్రంలో శత్రు జలాంతర్గాముల భద్రతాపరమైన కార్యకలాపాలను అడ్డుకునే లక్ష్యంతో ఈ నూతన నౌకను రూపొందించారు. ఆంద్రోత్ అనే పేరును లక్షద్వీప్ ద్వీప సమూహంలోని ఒక ద్వీపం నుంచి ఎంపిక చేశారు. ఈ నౌకను కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ లిమిటెడ్ (GRSE) సంస్థ పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించింది. ఇటీవలి కాలంలో భారత నౌకాదళంలో అత్యాధునిక యుద్ధ నౌకలైన అర్నాలా, నిస్తార్, ఉదయగిరి, నీలగిరి ప్రవేశించగా, తాజాగా ఆంద్రోత్ కూడా చేరడంతో సముద్ర భద్రతలో భారత నౌకాదళం మరింత బలోపేతం అవుతోంది. ఈ సందర్భంగా వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధర్కర్ మాట్లాడుతూ, "స్వదేశీకరణ దిశగా ఇది భారత నౌకాదళానికి ఒక కీలక ముందడుగు. దేశీయ నౌకా నిర్మాణ సామర్థ్యాన్ని ఇది ప్రతిబింబిస్తుంది," అని అన్నారు.

# విజయవాడ - హైదరాబాద్ హైవేపై
# రెండో రోజూ అదే సీన్..

**తగ్గని వాహనాల రద్దీ**
**4 కి.మీ. మేర నిలిచిపోయిన వాహనాలు**
**ట్రాఫిక్ జామ్ తో ప్రయాణికుల అవస్థలు**
**వంతెన నిర్మాణ పనుల వల్ల నెమ్మదిగా కదులుతున్న వెహికల్స్**




విజయవాడ, అక్టోబర్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

దసరా పండుగకు సొంతూళ్లకు వెళ్లిన నగరవాసులు తిరుగు ప్రయాణంలో తీవ్ర అవస్థలు పడుతున్నారు. జాతీయ రహదారిపై వాహనాల రద్దీ నెలకొంది. విజయవాడ%-%హైదరాబాద్ హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. రెండో రోజు కూడా ట్రాఫిక్ తగ్గకపోవడంతో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. నల్గొండ జిల్లా చిట్యాల నుంచి పెద్దకాపర్తి వరకు సుమారు 4 కిలోమీటర్ల మేర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పెద్దకాపర్తి, చిట్యాల వద్ద వంతెన నిర్మాణ పనులు జరుగుతుండటంతో ఈ సమస్య తలెత్తింది. పంతంగి టోల్ ప్లాజా, చౌటుప్పల్, దండు మల్కాపురం వద్ద కూడా వాహనాల రద్దీ కొనసాగుతోంది. హైదరాబాద్ లోని ఎల్బీనగర్ చింతలకుంట నుంచి కొత్తపేట వరకు భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. చింతలకుంట ఫ్లైఓవర్ మీద ట్రావెల్స్ బస్సులు నిలిచిపోవడంతో పరిస్థితి మరింత జఠిలంగా మారింది.

# నల్లగా మారుతున్న ఎర్రకోట..

- **శాస్త్రవేత్తల అధ్యయనంలో ఆందోళనకర అంశాలు**
- **ఢిల్లీ ఎర్రకోట రంగు మార్పు**
- **కాలుష్యం కారణంగా నల్లగా మారుతున్న ఎర్రరాయి గోడలు**
- **'బ్లాక్ క్రస్ట్స్' వల్లే సమస్య అని తేల్చిన అధ్యయనం**
- **వాహన, పారిశ్రామిక కాలుష్యమే ప్రధాన కారణం**
- **కట్టడం పటిష్ఠతకు ముప్పు అని నిపుణుల హెచ్చరిక**



దేశ రాజధాని ఢిల్లీకి తలమానికంగా నిలిచే చారిత్రక ఎర్రకోట తన సహజ సౌందర్యాన్ని కోల్పోయే ప్రమాదంలో ఉంది. నగరంలోని తీవ్ర వాయు కాలుష్యం కారణంగా 17వ శతాబ్దపు ఈ అద్భుత కట్టడం తన ఎర్రటి రంగును కోల్పోయి నల్లగా మారుతోంది. భారత్-ఇటలీ శాస్త్రవేత్తల బృందం సంయుక్తంగా నిర్వహించిన ఒక అధ్యయనంలో ఈ ఆందోళనకర విషయం వెలుగులోకి వచ్చింది. ఢిల్లీలోని విషపూరిత గాలి ఎర్రకోట రాతి గోడలను రసాయనికంగా దెబ్బతీస్తోందని ఈ పరిశోధన తేల్చి చెప్పింది. వాహనాల పొగ, పరిశ్రమలు, నిర్మాణ రంగం నుంచి వెలువడే ధూళి కణాలు గాలిలో కలిసి కోట గోడలపై పేరుకుపోతున్నాయి. దీనివల్ల 'బ్లాక్ క్రస్ట్స్' (నల్లటి గట్టి పొరలు) ఏర్పడుతున్నాయి. ఈ పొరలలో జిప్సం, క్వార్ట్జ్‌తో పాటు సీసం, రాగి, జింక్ వంటి ప్రమాదకరమైన భార లోహాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. 2021 నుంచి 2023 వరకు సాగిన ఈ అధ్యయన వివరాలను జూన్ 2025లో 'హెరిటేజ్' అనే అంతర్జాతీయ జర్నల్‌లో ప్రచురించారు. ఈ నల్లటి పొరలు కేవలం కట్టడం రంగును మార్చడమే కాకుండా, దాని పటిష్టతను కూడా దెబ్బతీస్తున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ సమస్యను ఇలాగే వదిలేస్తే, గోడలపై ఉన్న సున్నితమైన, అపురూపమైన శిల్పకళ శాశ్వతంగా దెబ్బతినే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఎర్రకోటకే కాకుండా ఢిల్లీలోని హుమాయున్ సమాధి వంటి ఇతర చారిత్రక కట్టడాలకు కూడా భవిష్యత్తులో ఇదే ముప్పు పొంచి ఉందని అధ్యయనం స్పష్టం చేసింది. అయితే, ఈ నష్టాన్ని నివారించడానికి కొన్ని పరిష్కార మార్గాలు ఉన్నాయని పరిశోధకులు సూచిస్తున్నారు. "ఈ నల్లటి పొరలు ఏర్పడటం ప్రారంభ దశలో ఉన్నప్పుడే వాటిని సురక్షితంగా తొలగించడం ద్వారా రాతికి జరిగే నష్టాన్ని తగ్గించవచ్చు. ప్రమాదం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో తరచూ శుభ్రపరిచే కార్యక్రమాలు చేపట్టడం, రాళ్లకు రక్షణ పూతలు వేయడం ద్వారా ఈ చారిత్రక సంపదను కాపాడుకోవచ్చు" అని అధ్యయనంలో పేర్కొన్నారు.

## పారిశ్రామిక పార్కుల అభివృద్ధిలో భాగస్వాములు కండి

# ఈఎస్ఆర్‌కు లోకేశ్ పిలుపు

- ముంబైలో కొనసాగుతున్న మంత్రి నారా లోకేశ్ పర్యటన
- ఈఎస్ఆర్ గ్రూప్ ప్రతినిధులతో భేటీ
- పోర్టుల వద్ద భారీ లాజిస్టిక్స్ పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదన
- రొయ్యల పరిశ్రమ కోసం కోల్డ్ చైన్ రంగంలో పెట్టుబడులకు పిలుపు
- విశాఖ, కాకినాడ, తిరుపతి మార్గాల్లో మెగా ఇండస్ట్రియల్ పార్కుల అభివృద్ధి

**అమరావతి, అక్టోబర్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక, లాజిస్టిక్స్ రంగాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ముంబైలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా, ఆయన గ్లోబల్ రియల్ ఎస్టేట్ దిగ్గజం ఈఎస్ఆర్ గ్రూప్ ప్రతినిధులతో సోమవారం నాడు సమావేశమయ్యారు. రాష్ట్రంలో పారిశ్రామిక పార్కుల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని వారిని ఆహ్వానించారు. ముంబైలోని తాజ్ ల్యాండ్స్ హెూటల్‌లో జరిగిన ఈ భేటీలో ఈఎస్ఆర్ గ్రూప్ ఇండియా ఇన్వెస్ట్‌మెంట్స్ హెడ్ సాదత్ షా, లీజింగ్ డైరెక్టర్ ప్రకృత్ మెహతా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలను



లోకేశ్ వారికి వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆమోదించిన 'ప్లగ్ అండ్ ప్లే ఇండస్ట్రియల్ పార్క్స్ పాలసీ 4.0' పెట్టుబడిదారులకు ఎంతో అనుకూలంగా ఉందని తెలిపారు. విశాఖపట్నం, కాకినాడ, తిరుపతి కారిడార్లలో వెయ్యి ఎకరాలకు పైగా విస్తీర్ణంలో మెగా ఇండస్ట్రియల్ పార్కులను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని, ఏపీఐఐసీతో కలిసి ఈ పార్కుల నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన ఈఎస్ఆర్ గ్రూప్‌ను కోరారు. రాష్ట్రంలోని పోర్టులకు సమీపంలో 3 నుంచి 5 భారీ లాజిస్టిక్స్ పార్కులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోందని లోకేశ్ వెల్లడించారు. ముఖ్యంగా విశాఖపట్నం, కాకినాడ పోర్టుల వద్ద మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్కుల ఏర్పాటుకు ముందుకు రావాలని సూచించారు. దేశంలోనే 70 శాతం రొయ్యల ఉత్పత్తి ఏపీలోనే జరుగుతున్నందున, కోల్డ్ చైన్ మౌలిక సదుపాయాల రంగంలో పెట్టుబడులకు మంచి అవకాశాలు ఉన్నాయని ఆయన నొక్కి చెప్పారు. సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల కోసం కంటైనర్ ఫ్రైట్ స్టేషన్లు, గిడ్డంగుల నిర్మాణంలో కూడా పెట్టుబడులు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈఎస్ఆర్ గ్రూప్ ఆసియా-పసిఫిక్‌లో 154 బిలియన్ డాలర్ల ఆస్తులను, భారత్‌లో 1.7 బిలియన్ డాలర్ల ఆస్తులను నిర్వహిస్తోంది.



## ఈ నెలలో పవన్ కల్యాణ్ జిల్లాల పర్యటనలతో బిజీ

**క్షేత్రస్థాయి పర్యటనలకు డిప్యూటీ సీఎం పవన్ సిద్ధం**
**తొలుత మన్యం జిల్లా కురుపాం గురుకుల పాఠశాల సందర్శన**
**పిఠాపురం, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోనూ పర్యటనలు**
**రాజోలులో పంచాయతీరాజ్ శాఖ కార్యక్రమంలో పాల్గొననున్న పవన్**
**ప్రభుత్వ కార్యక్రమాల తర్వాత జన సైనికులతో ప్రత్యేక భేటీలు**
**త్వరలోనే ఖరారు కానున్న పర్యటనల తేదీలు**

**అమరావతి, అక్టోబర్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ క్షేత్రస్థాయి పర్యటనలకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఈ నెలలో ఆయన పలు జిల్లాల్లో పర్యటించనున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలోని గురుకుల పాఠశాలలో పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తన పర్యటనను అక్కడి నుంచే ప్రారంభించాలని పవన్ నిర్ణయించారు. కురుపాం వెళ్లి ఆ పాఠశాలను పరిశీలించడంతో పాటు, విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన తన సొంత నియోజకవర్గమైన పిఠాపురంతో పాటు ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో కూడా పర్యటించనున్నారు. అలాగే, తన శాఖకు సంబంధించిన ఒక ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాజోలు నియోజకవర్గానికి వెళ్లనున్నారు. పర్యటనల సమయంలో మొదట అధికారిక కార్యక్రమాల్లో పాల్గొని, ఆ తర్వాత స్థానిక జనసేన నాయకులు, జన సైనికులు, వీర మహిళలతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ప్రస్తుతం ఈ పర్యటనలకు సంబంధించిన షెడ్యూల్ రూపకల్పన జరుగుతోందని, త్వరలోనే తేదీలను అధికారికంగా ఖరారు చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.

## మూడేళ్లలో సలహాలు ఇచ్చి రూ. 241 కోట్లు సంపాదించాను: ప్రశాంత్ కిశోర్

**వ్యక్తులు, పార్టీలు లేదా కంపెనీలకు ఇచ్చిన సలహా ద్వారా ఆర్జించినట్లు వెల్లడి**
**రూ. 31 కోట్లు జీఎస్టీ, రూ. 20 కోట్లు పన్ను చెల్లించినట్లు తెలిపిన ప్రశాంత్ కిశోర్**
**జన్ సురాజ్ పార్టీకి రూ. 98.95 కోట్లు విరాళంగా ఇచ్చానన్న ప్రశాంత్ కిశోర్**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు, ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ బీహార్‌లో నిర్వహించిన ర్యాలీలో తన ఆదాయాన్ని వెల్లడించారు. గత మూడు సంవత్సరాలలో కంపెనీలకు లేదా వ్యక్తులకు లేదా పార్టీలకు ఇచ్చిన సలహాల ద్వారా రూ. 241 కోట్లు సంపాదించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో దాదాపు రూ. 31 కోట్లు జీఎస్టీ చెల్లించినట్లు తెలిపారు. ఇది తన ఆదాయంలో 18 శాతమని ఆయన వెల్లడించారు. రూ. 20 కోట్లు ఆదాయపు పన్ను చెల్లించానని, అలాగే జన్ సురాజ్ పార్టీకి రూ. 98.95 కోట్లు విరాళంగా ఇచ్చానని ప్రశాంత్ కిషోర్ తెలిపారు. తాను ఇతరుల మాదిరిగా దొంగను కాదని ఆయన అన్నారు. తనకు డబ్బులు ఎలా వచ్చాయో, వాటిని ఏ విధంగా ఖర్చు చేశానో స్పష్టంగా చెప్పగలనని అన్నారు. తాను గతంలో పార్టీలకు, వ్యక్తులకు సలహాలు ఇచ్చినందుకు ఎలాంటి రుసుము వసూలు చేయలేదని, రాజకీయాల్లోకి ప్రవేశించాక తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రశాంత్ కిశోర్ రాజకీయ ప్రచారాలకు డబ్బు ఎక్కడి నుండి వస్తోందని బీహార్‌లోని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. బీజేపీ నాయకుడు సంజయ్ జైస్వాల్ పలుమార్లు ప్రశాంత్ కిశోర్ ఆదాయ వనరుల గురించి నిలదీశారు. కాగా, రాబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో జన్ సురాజ్ పార్టీ పోటీ చేయనుంది. ఇందుకోసం ప్రశాంత్ కిశోర్ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.



## పేరూరు దసరా ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే అయితాబత్తుల





**అమలాపురం, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

పేరూరు దసరా ఉత్సవాలలో పాల్గొన్న గౌరవ ఎమ్మెల్యే శ్రీ అయితాబత్తుల ఆనందరావు గారు. ఈ కార్యక్రమంలో %ణజమీా% చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సత్తిబాబురాజు, మాజీ కౌన్సిలర్ దున్నలా దుర్గా, మొయిలి శివ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ జెండా స్థూపం ఆవిష్కరణ



**అమలాపురం అక్టోబర్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

వన్నెచింతలపూడి గ్రామంలో తెలుగుదేశం పార్టీ జెండా స్థూపాన్ని ఆవిష్కరించిన గౌరవ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు. ఈ కార్యక్రమంలో DCMS చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, అమలాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ అధికారి జయవెంకటలక్ష్మి బాబ్జీ, దంతులూరి వాసురాజు, చొల్లంగి సాయిబాబు, నడింపల్లి ఉదయబాబు, బొర్రా ఈశ్వరరావు, కంకటాల రామం, అర్జున్ వర్మ, నంద్యాల దొరబాబు, కైరాం రాము తదితరులు పాల్గొన్నారు

## షెడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన అయితాబత్తుల



**అమలాపురం అక్టోబర్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**


వన్నెచింతలపూడి సొసైటీ బిల్డింగ్ పైన షెడ్డు నిర్మాణ పనులను గౌరవ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో DCMS చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, దంతులూరి వాసురాజు, చొల్లంగి సాయిబాబు, నడింపల్లి ఉదయబాబు, బొర్రా ఈశ్వరరావు, కంకటాల రామం, అర్జున్ వర్మ, ఏరుబండి వెంకటేశ్వరరావు, నంద్యాల దొరబాబు, కైరాం రాము తదితరులు పాల్గొన్నారు

## దత్తుడు గారి కుటుంబ సభ్యులను పరామర్శించిన గౌరవ ఎమ్మెల్యే శ్రీ అయితాబత్తుల ఆనందరావు



**అమలాపురం, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

తెలుగుదేశం పార్టీ నాయకులు కర్రి దత్తుడు కుటుంబ సభ్యులను అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు గారు ఆదివారం పరామర్శించారు. ఆయన మాతృ మూర్తి మూడు రోజుల క్రితం పరమపదించారు. ఎమ్మెల్యే గారి వెంట అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు గారు తదితరులు తో పాటు కర్రి రాఘవ, కర్రి యేసు బాబు, కర్రి సత్తిబాబు వున్నారు.



చిందాడగురువు గ్రామంలో పాలమూరి వారి వివాహ వేడుకలో పాల్గొన్న గౌరవ ఎమ్మెల్యే శ్రీ అయితాబత్తుల ఆనందరావు

## ఉద్యోగులను మోసం చేశారు: ప్రభుత్వంపై జగన్ తీవ్ర విమర్శలు

**ఉద్యోగుల విషయంలో కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందని జగన్ ఆరోపణ**
**ఎన్నికల హామీలను విస్మరించారంటూ తీవ్ర విమర్శలు**
**పీఆర్సీ, ఐఆర్, డీఏ బకాయిల ఊసే లేదని ధ్వజం**

**అమరావతి, అక్టోబర్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, వారిని నమ్మించి మోసం చేస్తోందని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉద్యోగుల సంక్షేమాన్ని గాలికొదిలేసి, భూ పందేరాలపైనే కేబినెట్ సమావేశాల్లో చర్చిస్తున్నారని ఆరోపించారు. "అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు అవుతున్నా, మేనిఫెస్టోలో ఉద్యోగులకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. తీపి మాటలతో అరచేతిలో వైకుంఠం చూపి, ఇప్పుడు వారిని నడిరోడ్డుపై నిలబెట్టారు" అని జగన్ విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇస్తామన్న మధ్యంతర భృతి (ఐఆర్) ఊసే లేదని, మెరుగైన పీఆర్సీ ఇస్తామని చెప్పి ఇప్పుడు ఆ ప్రస్తావనే తీసుకురావడం లేదని మండిపడ్డారు. తమ ప్రభుత్వ హయాంలో వారం రోజుల్లోనే ఐఆర్ ప్రకటించడమే కాకుండా, పీఆర్సీ కమిషన్‌ను కూడా నియమించామని గుర్తుచేశారు. కానీ, ఈ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే పీఆర్సీ ఛైర్మన్‌ను తొలగించి, ఉద్యోగులకు



జీతాలు పెరగకుండా అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన నాలుగు డీఏలు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని, పండుగలకు కూడా బకాయిలు చెల్లించకపోవడంతో వారు నిరాశకు గురవుతున్నారని జగన్ పేర్కొన్నారు. సీపీఎస్/జీపీఎస్‌పై ఆమోదయోగ్యమైన పరిష్కారం అని చెప్పి, అధికారంలోకి వచ్చాక ఒక్కసారి కూడా సమీక్ష జరపలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన జీపీఎస్ విధానాన్నే ఇప్పుడు కేంద్రంతో పాటు పలు రాష్ట్రాలు అనుసరిస్తున్నాయని తెలిపారు. ఉద్యోగులకు పీఆర్సీ బకాయిలు, డీఏలు, జీపీఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ వంటి వాటి కింద ప్రభుత్వం సుమారు రూ.31 వేల కోట్లు బకాయి పడిందని జగన్ ఆరోపించారు. ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు ఏ తేదీన జీతాలు వస్తాయో తెలియని దుస్థితికి ఉద్యోగులను నెట్టారని అన్నారు. తమ హయాంలో కరోనా సంక్షోభంలోనూ సకాలంలో జీతాలు ఇచ్చామన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల విషయంలోనూ ఈ ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తోందని జగన్ విమర్శించారు. తమ ప్రభుత్వం 10,117 మంది కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియ ప్రారంభిస్తే, ఈ ప్రభుత్వం దానిని నిలిపివేసి వారి జీవితాలతో చెలగాటమాడుతోందని అన్నారు. దళారీ వ్యవస్థను నిర్మూలించేందుకు తాము తీసుకొచ్చిన ఆప్కాస్‌ను రద్దు చేసి, మళ్లీ పాత దోపిడీ విధానాన్ని తెస్తున్నారని మండిపడ్డారు. వాలంటీర్లకు రూ.10 వేల గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చి, కుట్రపూరితంగా వారిని రోడ్డున పడేశారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల ఈహెచ్ఎస్ వాటాను కూడా ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఆసుపత్రుల్లో వైద్యం అందడం లేదని, ఇది అత్యంత దుర్మార్గమని ఆయన పేర్కొన్నారు.

# గోకులం షెడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే అయితాబత్తుల శంకుస్థాపన



అమలాపురం అక్టోబర్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

వన్నెచింతలపూడిలో గోకులం షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన గౌరవ ఎమ్మెల్యే శ్రీ అయితాబత్తుల ఆనందరావు గారు. ఈ కార్యక్రమంలో DCMS చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, అమలాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమతి అధికారి జయవెంకటలక్ష్మి బాబ్జీ, దంతులూరి వాసురాజు, చొల్లంగి సాయిబాబు, నడింపల్లి ఉదయబాబు, బొర్రా ఈశ్వరరావు, కంకటాల రామం, పొలమూరి ధర్మపాల్, నంద్యాల దొరబాబు, కైరాం రాము, నల్లా చిట్టి తదితరులు పాల్గొన్నారు

# చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



అమలాపురం అక్టోబర్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

అమలాపురం టిఎన్టియుసి ఆధ్వర్యంలో ఆటోవాలాకు 15 వేల రూపాయలు అందించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి అమలాపురం గడియార స్తంభం సెంటర్లో పాలాభిషేకం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు గారి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన గౌరవ ఎమ్మెల్యే శ్రీఅయితాబత్తుల ఆనందరావు గారు. ఈ కార్యక్రమంలో DCMS చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామి ,అమలాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమతి అధికారి జయవెంకటలక్ష్మి బాబ్జీ, నల్లా స్వామి, కంచిపల్లి అబ్బులు బోనం సత్తిబాబు కంచిపల్లి అబ్బులు బోనం సత్తిబాబు, బొర్రా ఈశ్వరరావు, కుసుమ సూర్యమోహన్, వలవల శివ రావు, పట్నాల రమణ, బొర్రా వెంకటేశ్వరరావు, నల్లా చిట్టి, పుల్లయ్య నాయుడు, పలువురు నేతలు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదంలో దగ్ధమైన కుటుంబాన్ని పరామర్శించిన జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి






కొత్తపేట, అక్టోబర్ 6:( తెలుగు రాష్ట్రం )

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం బిల్లకుర్రు గ్రామం అంబేద్కర్ కాలనీలో నిన్న చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో గోడా లక్ష్మీ గారి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో ఇంటి సామగ్రి మొత్తం మంటల్లో నాశనం అయింది. ఈ విషయం తెలిసిన వెంటనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఈ రోజు సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఆయన మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు మరియు ?5000 నగదు సహాయం అందజేశారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ, "బాధిత కుటుంబానికి పార్టీ తరపున అన్ని విధాలా అండగా ఉంటాం. అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# విద్యా బాల మందిర్ ఉపాధ్యాయుడుకి గురు బ్రహ్మ అవార్డు



కొత్తపేట అక్టోబర్ 6 ( తెలుగు రాష్ట్రం)

కొత్తపేట విద్యా బాల మందిర్ ఉపాధ్యాయుడు కుసుమ సుధాకర్ గత పది సంవత్సరాలుగా విద్యా బాల మందిర్ హైస్కూలులో గణిత ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నారు. వీరికి రాజమహేంద్రవరం ఎడ్యుకేషన్ సంస్థ వారు " గురు బ్రహ్మ" అవార్డు తో సత్కరించారు. ఈ అవార్డును ఆదివారం రాత్రి రాజమహేంద్రవరం ఆనంద్ రిజెన్సీ ఫంక్షన్ హాలు నందు జరిగిన సన్మాన కార్యక్రమం లో ఆదిత్య విద్యా సంస్థలు డైరెక్టర్ యస్ పి గంగిరెడ్డి, సత్యం కంప్యూటర్స్ వైస్ చైర్మన్ పి నాగరాజు, యన్ యస్ ఐ ఎల్ నరసింహ రీజనల్ ఇన్స్పెక్టర్ ఆఫీసర్ రాజమహేంద్రవరం, డా పి విజయ్ భాస్కర్ చేతులమీదుగా అవార్డు, మేమెంటో, మెడల్ అందుకున్నారు అని కరస్పాండెంట్ ఆర్ అనురాధ గారు తెలిపారు. ఈరోజు పాఠశాలలో జరిగిన భ్య అభినందన కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయుె డబ్బైలు నూకపేయి శివరత్నం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్ని సుధాకర ని అభినందనలతో ముంచెత్తారు.

# రాష్ట్రంలోనే తొలిసారిగా అమలాపురం నియోజకవర్గంలో బ్రిటిష్ కొలమానాన్ని తెరపైకి తీసుకువచ్చిన ఎమ్మెల్యే అయితాబత్తుల

- నడిపూడి నుండి చల్లపల్లి వరకు కాలువ పక్కన గల రోడ్డుకు ఇరువైపులా ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి కాకుండా సరిహద్దు రాళ్ళు ఏర్పాటు చేసే కార్యక్రమానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు
- బ్రిటిష్ కొలతలకు సర్వే రాళ్లు...
- ఎస్ యానాం వరకు మొదటి విడత సర్వే...
- ఆక్రమణలు దశలు వారీగా తొలగింపు...





అమలాపురం అక్టోబర్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

నడిపుడి నుంచి చల్లపల్లి వరకు తొలి విడత సర్వే రాళ్లను ఈరోజు వేయడం ప్రారంభించారు. శాసనసభ్యులతో పాటు జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్, జె సి నిషాంతి, అర్డీఓ మాధవి ల సమక్షంలో ఈ రాయిలు పాతడం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ దీన్ని ఆదర్శంగా తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ప్రస్తుతం తాము సర్వే చేసి స్థల నిర్ధారణ చేస్తున్నామని అవసరాలకు అనుగుణంగా ఆక్రమణలు తొలగించడం జరుగుతుందని ఎమ్మెల్యే గారు అన్నారు. కాలువ వెంబడి ఉన్న ఆక్రమణలు గుర్తించి వాటిపై త్వరలో చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ గారు తెలిపారు. నడిపూడి కొత్త వంతెన నుంచి నల్లవంతెన వరకు 20 అడుగుల రోడ్డు వెడల్పు చేస్తామని ఆనందరావు గారు అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ అశోక ప్రసాద్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమతి అధికారి జయలక్ష్మి బాబ్జి, చొల్లంగి సాయి బాబు, కంచిపల్లి అబ్బులు, లింగోలు పండు, నల్లా వెంకటేశ్వరరావు, బోనం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష



అమలాపురం, అక్టోబర్ 6:( తెలుగు రాష్ట్రం )

కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో అక్టోబర్ 10 నుండి 18 వరకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ నేపధ్యంలో అమలాపురం జిల్లా కలెక్టరేట్లో సోమవారం సమీక్ష సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ శ్రీ మహేష్ కుమార్ ఐఎఎస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ శ్రీ రాహుల్ మీనా ఐపీఎస్, కొత్తపేట ఆర్డీవో శ్రీ శ్రీకర్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీ ముదునూరి వెంకటరాజు, ఎండోమెంట్స్ డిప్యూటీ కమిషనర్ శ్రీ నల్లం సూర్యచక్రధరరావు, కొత్తపేట డీఎస్పీ శ్రీ సుంకర మురళీమోహన్, ఆత్రేయపురం తహసీల్దార్ శ్రీ రాజేశ్వరరావు తదితర అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో భక్తుల రాకపోకలు, భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్ స్థలాలు, తాగునీటి సదుపాయాలు, వైద్య శిబిరాలు, శానిటేషన్ మరియు ఇతర సౌకర్యాలపై విస్తృతంగా చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ, బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలి అని సూచించారు. అధికారులందరూ కలసికట్టుగా పని చేస్తే వేడుకలను విజయవంతంగా నిర్వహించగలమని పేర్కొన్నారు. ఆలయ అధికారులు ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న ఏర్పాట్ల వివరాలను వివరించారు.



# సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ తో ప్రజలకు ఆర్థికలాభం.....

## కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.....

కొత్తపేట, అక్టోబర్ 6:( తెలుగు రాష్ట్రం )



తగ్గిన జీఎస్టీ తో పేద, మధ్యతరగతి, వ్యవసాయ, వ్యాపార, విద్యా, వైద్య రంగాల వారికి ఎంతగానో మేలు జరుగుతుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. రావులపాలెం క్యాంపు కార్యాలయంలో సోమవారం జీఎస్టీ 2.0 పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి వర్గాలకు ఎన్డీఏ ప్రభుత్వం సూపర్ గిఫ్ట్ ఇచ్చిందన్నారు. కొత్తగా అమల్లోకి వచ్చిన జీఎస్టీ 2.0 లో రెండు స్లాబులు మాత్రమే ఉన్నాయని తెలిపారు. గతంలో అత్యధికంగా 28% స్లాబు ఉండేదని దాన్ని పూర్తిగా రద్దు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుత జీఎస్టీలో 5%,18% స్లాబులు మాత్రమే అమలులో ఉన్నాయన్నారు. జిఎస్టి 2.0 తో రాష్ట్ర ప్రభుత్వానికి 8వేల కోట్ల ఆదాయం తగ్గనుందని,అయితే ఆ మేరకు ప్రజలు లబ్ధి పొందనున్నారని తెలిపారు. తగ్గిన జిఎస్టితో రోజువారీ ఉపయోగించే వస్తువులపై 0 శాతం లేదా 5 శాతం మాత్రమే పన్ను పడుతుందన్నారు. దీనితో ప్రతి కుటుంబానికి రూ.15 వేల వరకూ అదా అవుతుందన్నారు. ప్రజలు రోజువారీ వినియోగించే కిరాణా సామాగ్రి,నిత్యవసరాలపై గతంలో 5%,12%,18% వరకూ పన్నులు ఉండేవని, ఇప్పుడు 0%లేదా 5% శాతానికి తగ్గాయని తెలిపారు. దీనితో సుమారు 13 శాతం వరకు పన్ను ఆదా అవుతుందన్నారు. ఆరోగ్య సేవలు, జీవిత బీమాకు గతంలో 18 శాతం వరకు పన్నులు ఉండేవని, ఇప్పుడు వాటిపై జిఎస్టి పూర్తిగా తొలగించడంతో పేద వర్గాలకు మరింత సులభతరంగా సేవలు అందనున్నాయని తెలిపారు. ట్రాక్టర్లు,పవర్ టిల్లర్లు మొదలైన వ్యవసాయ పరికరాల ధరలు భారీగా తగ్గి రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, స్టేషనరీ సామాను, పాల ఉత్పత్తుల ధరలు తగ్గాయని తెలిపారు. నూతనంగా అమల్లోకి వచ్చిన జీఎస్టీ పై సామాన్యులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. వ్యాపారవర్గాలు సైతం జీఎస్టీ తగ్గింపు వినియోగదారులకు దక్కేలా చూడాలన్నారు. తద్వారా కొనుగోళ్లు పెరిగి వారికి సైతం వ్యాపారాభివృద్ధి జరుగుతుందన్నారు. జీఎస్టీ తగ్గింపు ఫలితాలు పేద,మధ్యతరగతి వర్గాలకు సంపూర్ణంగా ఉపయోగపడాలన్నారు. అందుకోసమే సభలు,సమావేశాలతో, ప్రచార పత్రాలతో ప్రజలను చైతన్యవంతులను చేయడానికి కొత్తపేట నియోజకవర్గ కూటమి కృషి చేస్తుందన్నారు.

# అమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ఈఓగా సత్యకుమార్.

అమలాపురం, అక్టోబర్ 6:( తెలుగు రాష్ట్రం )



, అమలాపురం : పెళ్లిళ్ల వెంకన్నగా పేరుగాంచిన ప్రసిద్ధమైన అమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఈఓగా పివివి సత్యకుమార్ నియమితులయ్యారు. సత్యకుమార్ గతంలో వాడపల్లి శ్రీ వెంకటేశ్వర దేవస్థానంలో సూపరిండెండెంట్ గా, అనంతరం కాకినాడ అన్నదాన సమాజం సూపరిండెండెంట్ గా పనిచేశారు. సేవా దృక్పథంతో, పారదర్శకతతో పనిచేసినందుకు ఆయనకు ఇటీవలే గ్రేడ్-1 ఈఓ పదోన్నతి లభించింది. "నీతినిజాయితీలతో, భక్తుల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తాను. తొలి పోస్టింగ్ కోనసీమ కి రావడం నా అదృష్టం," అని ఈ సందర్భంగా సత్యకుమార్ తెలిపారు.

# రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ చైర్మన్ మండలపు రవికి అభినందనలు



తాడేపల్లిగూడెం, అక్టోబర్ 6 (తెలుగురాష్ట్రం విలేకరి):

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన మందాలపు రవిని తెదేపా నియోజకవర్గం ఇంచార్జి, భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) ఆధ్వర్యంలో పలువురు నాయకులు సోమవారం కలిసి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పరిమి రవికుమార్, పట్నాల రాంపండు, దాసరి అప్పన్న, గొర్రెల శ్రీధర్, పాతూరి రాంప్రసాద్ చౌదరి, ఎస్.కే బాజీ, పసల కొండ, పసుమర్తి రామ లక్ష్మణ్, మిద్దె కనకారావు, మద్దిపాటి రవితేజ, శనగన శ్రీనివాస్, కుసులూరి రఘు ప్రసాద్, అబ్బిన గోపాలకృష్ణ, సూర్పన వెంకటరావు , కూచిపూడి సుబ్రహ్మణ్యం, సీలి వెంకటాచలం, అడ్డాల నరసింహారావు, దళాయి తిరుమలరావు, బాదంపూడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జిఎస్టీ 2.0 అవగాహన....



అమలాపురం, అక్టోబర్ 6:( తెలుగు రాష్ట్రం )

సూపర్ జిఎస్టీ..సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా ఎర్ర వంతెన దగ్గర ఉన్న ఓప్ లెన్స్ సెల్యూన్ షాప్ లో జీఎస్టీ పై అవగాహన కల్పించిన మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్ సి. టి. ఓ జగన్మోహన్ రెడ్డి చాంబర్ అధ్యక్షులు బోణం సత్యవరప్రసాద్ ఛాంబర్ సలహాదారులు కంచిపల్లి అబ్బులు అధికారులు పాల్గొన్నారు.

ఉభయ గోదావరి
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

# సీఎం సహాయ నిధి.. పేదలకు పెన్నిధి..

**-సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ**



**నాయుడుపేట, అక్టోబర్ 6 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**
సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిదని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. సోమవారం నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో భాగంగా కాపులూరు గ్రామానికి చెందిన బూదూరు మునీంద్ర పాముకాటుతో ఇబ్బందులకు గురి అయిన కారణంగా హాస్పిటల్ నిమిత్తం 20వేల రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా నాయుడుపేట కాపులూరు గ్రామానికి చెందిన బూదూరు మునీంద్రకు చెక్కును ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మాట్లాడుతూ వైద్యం పరంగా ఆపదలో ఉన్న వారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో కాపులూరు గ్రామానికి చెందిన బూదూరు మునీంద్ర కు 20వేల రూపాయలు చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. చెక్కులు అందుకున్న వారు మాట్లాడుతూ వైద్య సహాయం కోసం సీఎం చంద్రబాబు అందించిన నిధులు తమకు అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ 786 రఫీ, దార్ల రాజేంద్ర, టీడీపీ నాయకులు కాపులూరు చక్రపాణి, పోట్లపూడి రాజేష్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జీఎస్టీ ఫలాలు పేద, మధ్యతరగతి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**ఇంచార్జ్ ఎంపీడీవో నిఖిల్ మధు శరణ్**




**జీలుగుమిల్లి, అక్టోబర్-06, (తెలుగురాష్ట్రం విలేఖరి):**
కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ ఫలాల పేద మధ్యతరగతి కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని ఇంచార్జ్ ఎంపీడీవో నిఖిల్ మధు శరణ్ తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్తు సమావేశ మందిరంలో సూపర్ జిఎస్టి-2.0పై వ్యాపారులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నిఖిల్ శరణ్ మాట్లాడుతూ సూపర్ జిఎస్టితో సామాన్యుడు, సగటు మనిషి సంతోషంగా ఉన్నాడని అన్నారు. ముఖ్యంగా జీఎస్టీ ఫలాలతో అన్ని వర్గాల్లో కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. వ్యాపారులు సూపర్ జిఎస్టి పై ప్రజలకు అవగాహన పెంచాలన్నారు. మండల విద్యాశాఖ అధికారి-02 బుచ్చిరాజు మాట్లాడుతూ సూపర్ జిఎస్టి తగ్గింపుపై అక్టోబర్-09వ అన్ని పాఠశాలలో వ్యాసరచన పోటీలు, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షులు కోరుకొండ సూరిబాబు, వ్యాపారులు చక్రి, కక్కిరాల శ్రీను, కక్కిరాల రాజేష్, చిట్లూరి సూర్యచంద్రరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అంగన్వాడీ చిన్నారులకు బేబి కుర్చీలు బహూకరణ



**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 6 (తెలుగురాష్ట్రం విలేకరి):**
పెంటపాడు మండలం కూనాగారపేటలోని అంగన్వాడీ పిల్లల సౌకర్యార్థం మానవతా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్ తాడేపల్లి మోహన్ రావు ఆధ్వర్యంలో మానవతా సేవా సంస్థ10 కుర్చీలను సోమవారం అందజేశారు. వీటితో పాటు రాత పలకలు, స్వీట్లు, పెన్సిళ్లు, బిస్కెట్లు, ఫ్రూటీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు టి.సంజయ ఖాన్,తానేటి కుమార్ రాజా, లింగాల బెన్నీ, అంగన్వాడి టీచర్ లింగాల గౌరి ఉన్నారు. ఈ సందర్భంగా మానవత ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్, పూర్వపు ఆంధ్రా బ్యాంక్ సీనియర్ మేనేజర్, వ్యక్తిత్వ వికాస నిపుణులు తాడేపల్లి మోహన్ రావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా165 మండలాలలో మానవతా సేవా సంస్థ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. నిరంతరం ప్రజలతో మమేకమవుతూ కష్టకాలంలో ఉన్న వ్యక్తులకు సహాయ సహకారాలు అందిస్తూ ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఉత్తమ సమాజ నిర్మాణమే లక్ష్యంగా పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడం, ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టడం, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కళాశాలలు, పాఠశాలలోని విద్యార్థులకు నైతిక విలువల బోధన, పేద విద్యార్థులకు, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఆర్థికంగా ఆదుకోవటం వంటి సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నామని చెప్పారు. బ్రతికి ఉన్న మనుషులకే కాక ఎవరైనా అనాధలు చనిపోయినప్పుడు వారి పార్థివ దేహాలకు సేవలు అందిస్తున్న ఏకైక సంస్థ మానవతా అని వివరించారు. ఈ కార్యక్రమంలో మానవతా కార్యవర్గ సభ్యులు తారాడి పాల్, విప్పర్తి వినాయకుడు, మీసాల సత్యనారాయణ, ఆర్.వి.టి. రాజ్ కుమార్, నల్లమిల్లి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

# ముంపు మండలాల వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించిన అధికారులు

**హర్షం ఉద్యోగులు మరియు ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్**




**చింతూరు, అక్టోబర్ 6 (తెలుగురాష్ట్రం విలేకరి):**
గత నెల చింతూరు డివిజన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చింతూరు డిప్యూటీ డీ యం హెచ్ ఓ ఆఫీస్ కార్యాలయం ముట్టడించారు. ఉద్యోగుల నిరసన ద్రుష్టి లో ఉంచుకుని అల్లూరి సీతారామరాజు జిల్లా డి యం హెచ్ ఓ మీ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీ ప్రకారం డి యం హెచ్ ఓ వారు పాడేరు నుండి 5 గురు సీనియర్ అసిస్టెంట్ సభ్యులతో కూడిన ఒక బృందాన్ని ముంపు మండలాలకు నా పంపించడం జరిగింది ఆ టీం సభ్యులు మూడు రోజులు పాటు గ్రీవెన్స్ నిర్వహించి ముంపు ప్రాంత ఉద్యోగుల సర్వీసు రిజిస్ట్రేర్ అప్డేషన్, సర్వీస్ కి సంబంధించిన సమస్యలు, కాంట్రాక్ట్ మరియు ఔట్ సోర్సింగ్ సమస్యలు కు సంబంధించిన అనేక సమస్యలను పరిష్కరిస్తూ సమస్యల పరిష్కారనికి కృషి చేసారు. గతంలో ఎంతో మంది డి యం హెచ్ ఓ లు ఉన్నప్పటికీ ఎవరు కూడా ముంపు మండలాల వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులకు న్యాయం చేసే నిర్ణయలు తీసుకోలేక పోయారు. కాని ప్రస్తుత డియం హెచ్ఓ చింతూరు డిప్యూటీ డీ యం హెచ్ ఓ కలిసి ఒక మంచి నిర్ణయం తీసుకోవడం మంచి పరిణామమని 5 గురు సీనియర్ అసిస్టెంట్ లను ఒక టీంగా పంపించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని నిర్ణయం తీసుకొవడం మంచి పరిణామమని ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ వారు మరియు ఉద్యోగులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. అలాగే చింతూరు డివిజన్ ఉద్యోగులు మా ప్రాంతానికి సీనియర్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ అయ్యే వరకు మా ప్రాంతలో ఇలాగే మా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డి యం హెచ్ ఓ వారిని, డిప్యూటీని కోరారు. వారికి చింతూరు డివిజన్ ఉద్యోగులు, ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ వారు డియంహెచ్ఓ వారికి డిప్యూటీ డీయంహెచ్ఓ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో చింతూరు డిప్యూటీ డీయంహెచ్ఓపీ పుల్లయ్య, పాడేరు డియంహెచ్ఓ ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్స్ కిరణ్ కుమార్, వెంకటరమణ, దినకర్ పాల్, శ్రీనివాస్, చందు, ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తుష్టి జోగారావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి జి. సీతమ్మ, ఐఎన్ టియు డివిజన్ అధ్యక్షులు డి. శ్రీనివాస్, కె భద్రకాళి, టి సీత, యం జయ, జి. చంద్రమ్మ, సి. హెచ్ గిరిజ, పి. గిరిజ చింతూరు డివిజన్ రెగ్యులర్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# జైలును తలపిస్తున్న విద్యా సంస్థలు

**-ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రైవేట్ విద్యా సంస్థలు**

**-రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ మేడా శ్రీనివాస్**



**రాజమహేంద్రవరం, అక్టోబర్ 6(తెలుగురాష్ట్రం ప్రతినిధి):**
జైళ్ళలో ఖైదీలకు అమలవుతున్న హక్కులు సైతం విద్యార్థులకు అమలు కావటం లేదు. సరైన అక్షర జ్ఞానం లేని సినిమా హీరోలుతో ర్యాంకుల కోసం ప్రచార ప్రకటనలు. కొన్ని కార్పొరేట్ మీడియా సంస్థల వ్యాపారం విద్యా మాఫియాకు వరం గా మారింది అని, ఇంటర్మీడియట్ బోర్డులు పిల్లల పాలిట నరక కూపాలుగా వున్నాయని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టీ వారాంతపు సమావేశంలో అర్పిసి వ్యవస్తాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ తీవ్ర ఆరోపణ చేసారు. విద్య ముసుగులో శ్రీ చైతన్య, నారాయణ మరి కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు పిల్లలను వేదిస్తు , హింసిస్తు చదివిస్తున్నారు. ఈ విద్యా సంస్థల ప్రాగణాలు ఆ నాడు స్వాతంత్ర్య సమర యోధులను, బ్రిటిష్ వ్యతిరేకులను, దేశ భక్తులను అండమాన్ దివుల్లో ప్రత్యేకంగా నిర్మించిన " కాలాపాని" జైల్లో నిర్బంధించి హింసిస్తు వేధింపులకు గురి చేసిన ఆ నాటి చరిత్రను విద్య అనే సాకుతో నేడు విద్యార్థులు ప్రత్యేక్షంగా అనుభవిస్తున్నారు అని ఆరోపించారు. శ్రీ చైతన్య , నారాయణ మరి కొన్ని విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు ఒకే రకమైన విద్యా అనువాదానికి బానిసలుగా మార్చుతు తల్లిదండ్రుల నుండి లక్షలకు లక్షలు దోచుకుంటున్నారని ఆయన తీవ్రంగా మండి పడ్డారు. ఈ సమావేశంలో అర్పిసి సెక్యులర్స్ సర్వశ్రీ డి వి రమణమూర్తి , దుడ్డే సురేష్ , వర్ధనపు శరత్ కుమార్ , గుడ్ల సాయి దుర్గా ప్రసాద్ , బసా సోనియా చల్లా అఖిల్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు సోదరులను ప్రభుత్వమే ఆదుకోవాలి

**-వరదల్లో నీట మునిగిన పంట పొలాలు**

**-నష్టం వాటిల్లడంతో ఆవేదన చెందుతున్న రైతులు**




**వి. ఆర్.పురం, అక్టోబర్ 06 (తెలుగురాష్ట్రం విలేఖరి):**
ఇటీవల వరుసగా వచ్చిన గోదావరి, శబరి నదుల వరదల వల్ల పంటచేలు మునిగిపోయి నష్టపోయిన రైతాంగానికి పంట నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం పార్టీ బృందం డిమాండ్ చేసింది. సిపిఎం జిల్లా నాయకులు సోయం చిన్నబాబు, పులి సంతోష్ కుమార్, ఎంపీపీ కారం లక్ష్మి ఆధ్వర్యంలో సిపిఎం బృందం మండల పరిధిలోని తోటపల్లి గ్రామాన్ని సోమవారం ఉదయం సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక రైతులు ఇటీవల వచ్చిన వరదల వల్ల పంటలన్నీ మునిగి తీవ్ర నష్టం జరిగిందని ప్రభుత్వం ద్వారా మమ్మల్ని ఆదుకోవాలని కోరగా స్పందించిన పార్టీ బృందం పంట నష్టం జరిగిన పొలాలను పరిశీలించడం జరిగింది. గత రెండు నెలలుగా విడతలవారీగా గోదావరి వరదలు మండలాన్ని అతలాకుతలం చేశాయని ఇప్పటికే వ్యవసాయ సీజన్ దాటిపోయే పరిస్థితి వచ్చిందని వేసిన పంటలను గోదావరి వరద రూపంలో నష్టపరిచిందని అన్నారు. తక్షణమే ప్రభుత్వ అధికారులు స్పందించి మండలంలో జరిగిన పంట నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రైతులందరికీ నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని కోరారు. పంట నష్టపోయిన వారందరికీ ప్రభుత్వమే సబ్సిడీ కింద విత్తనాలు సరఫరా చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పంకు సత్తిబాబు, పోడియం శ్రీరామమూర్తి, కారం సుందరయ్య, కమ్మచిచ్చు సత్యనారాయణ, కుంజా కన్నయ్య, కురసం శ్రీను గ్రామస్తులు, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా గ్రీవిన్స్ లో దరఖాస్తులు త్వరగతినా పరిష్కరించండి

**-ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్**



**రంపచోడవరం,అక్టోబర్ 6(తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**
ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు సంబంధించిన సమస్యల దరఖాస్తులు వ్యక్తిగతమునకు సంబంధించిన సమస్యల దరఖాస్తులను స్వీకరించి కొన్ని సమస్యలు వెంటనే పరిష్కరించి మరికొన్ని సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను పరిష్కార మార్గాలు అన్వేషించి సమస్యలు పరిష్కారం కొరకు సంబంధిత అధికారులకు పంపడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ పేర్కొన్నారు.సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశపు హాలులో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్) కార్యక్రమం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్,ఏపీఓ జనరల్ డివిఎస్ రమణ,గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య,సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారిని యం.సావిత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ ఈ వారం సుమారు 63 దరఖాస్తులు రావడం జరిగిందని ఆయన తెలిపారు. వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు పూర్తిస్థాయిలో పరిశీలించి దరఖాస్తుదారుల అర్హతలను బట్టి సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి. అంబేద్కర్, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, సబ్ డి ఎఫ్ ఓ అనూష, పి.హెచ్ఓ దేవదానం, ఉపాధి హామీ పథకం ఎపిడి శ్రీనివాస్ విశ్వనాథ్, ఎడీఏలు కె. సావిత్రి, రామ్మోహన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, సుబ్బయ్య, తహసిల్దార్ బాలాజీ, ఎంపీడీవో ఆఫీస్ ఏవో పి.జయంతి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, పి.వెంకటరమణ, రామచంద్ర మూర్తి, మల్లికార్జునరావు, సుబ్బయ్య, భవాని, రమేష్, ఏఎంఓ విజయభాస్కర్, వెలుగు ఏపిడి దేగలయ్య, డాక్టర్లు శిరీష, కేథరిన్, డిప్యూటీ తహసిల్దార్లు స్వామి, శివ, సూపర్డెంట్ బి.కిషోర్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎం.లక్ష్మణ్, సబ్ రిజిస్టర్ ఉపేంద్ర, పీఎంయు అధికారిని చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.ం-

# ఆదివాసులు సాగు చేసుకుంటున్నా భూములు లాక్కోవడం దారుణం

**ఆదివాసి సంక్షేమ పరిషత్**



**కూనవరం అక్టోబర్ 6 ( తెలుగు రాష్ట్రం విలేఖరి )**
సోమవారం నాడు ఆదివాసి సంక్షేమ పరిషత్. సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను మాట్లాడుతూ. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసి చట్టాలకు గాని ఆదివాసులకు గాని రక్షణ లేకుండా పోతుందని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. ముత్తాతల కాలం నుండి ఆదివాసులు సాగు చేసుకుంటున్నటువంటి పోడు భూములలో ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారు మరియు ప్రభుత్వ ఉన్నత అధికారులు కలిసికట్టుగా కక్షపూరితంగా ఆదివాసులపై దౌర్జన్యం చేసి పోడు భూములపై ఆధారపడి జీవిస్తున్నటువంటి నిరుపేద కొండారెడ్డి ఆదివాసులను భూములు నుండి తరిమేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. కానీ ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టం అమల్లో ఉన్నప్పటికీ మైదాన ప్రాంతాల నుండి వేలాది మంది నాన్ ట్రైబల్స్ వలసలు వచ్చి ప్రభుత్వ ఆర్ అండ్ బి ఆదివాసి భూములను కబ్జా చేసి స్థిర నివాసాలు, అక్రమ కట్టడాలు కట్టుకొని వ్యాపారులు చేస్తున్న, వ్యవసాయలు చేస్తున్న వారిపై మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని. ఏజెన్సీ వారసులైనటువంటి ఆదివాసులు పై మాత్రం దౌర్జన్యంగా ప్రభుత్వ అధికారులే ఆదివాసులు సాంగు చేసుకుంటున్నా భూములు నుండి తరిమేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. ఏజెన్సీ చట్టాలు ఉన్నది ఆదివాసుల కోసమా లేక నాన్ ట్రైబల్స్ కోసమా? అని అయినా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పశ్చిమ ఏజెన్సీలో ఆదివాసులపై తప్పుడు కేసులు బనాయించడం పోడు భూములపై ఆధారపడి జీవిస్తున్నటువంటి ఆదివాసులను తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపించటం వంటి కక్షపూరిత చర్యలు జరుగుతున్నాయని. వీటన్నిటిపై ప్రస్తుతం కె ర్ పురం ఐటిడిఎ పరిధిలో పర్యటలో ఉన్న షెడ్యూల్ తెగల కమిషన్ మెంబర్ జాటోత్ హుస్సేన్ నాయక్ స్పందించి ఆదివాసులపై జరుగుతున్న అరాచకాలను అరికట్టాలని. ఆదివాసి చట్టాలు పటిష్టంగా అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని. ఏజెన్సీలో నాన్ ట్రైబల్స్ అక్రమ కట్టడాలను తొలగించాలని, పోడు భూములపై ఆధారపడి జీవిస్తున్న ఆదివాసులకు రక్షణ కల్పించి ఆ భూములకు హక్కులు కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ నాయకులు కోపల లచ్చిరెడ్డి, దుర్గారెడ్డి, వేట్ల పెంటమ్మ, దుర్గమ్మ, వేట్ల ఎర్రం రెడ్డి, కోపల నాగమణి, వీర కుమారి, మాధురి, సీతమ్మ, పొట్ట కామేష్, ప్రసాద్ ఏడుకొండలు, అబ్బాయి దొర తదితరులు పాల్గొన్నారు

# టీమ్ కల్చర్‌కు ఇబ్బంది..

## అందుకే రోహిత్‌ను తప్పించారా?

భారత వన్డే క్రికెట్ సారథ్యం నుంచి రోహిత్ శర్మను బీసీసీఐ మేనేజ్‌మెంట్ తప్పించింది. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని శుభ్‌మన్ గిల్‌ను కెప్టెన్‌గా చేసింది. అయితే, దీనిపై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి. రోహిత్ సారథ్యంలో భారత్ వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు వెళ్లింది. ఆ తర్వాత ఛాంపియన్స్ ట్రోఫీని నెగ్గింది. వచ్చే వన్డే ప్రపంచకప్ (2027) వరకూ కొనసాగిస్తే బాగుండేదనే అభిప్రాయమూ వ్యక్తమైంది. అయితే, మేనేజ్‌మెంట్ ఆలోచన మాత్రం భిన్నంగా ఉంది. రాబోయేకాలంలో గిల్‌కే మూడు జట్ల పగ్గాలను అందించేందుకు చూస్తోంది. ఇప్పటికే టెస్టు సారథ్యం ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇటు టీ20ల్లోనూ సూర్యకుమార్ యాదవ్‌కు డిప్యూటీగా నియమించింది. వచ్చే ఏడాది పొట్టి కప్ తర్వాత ఎలానూ గిల్‌కే కెప్టెన్సీ రావడం ఖాయం. తాజాగా ఓ కథనం క్రికెట్ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. కెప్టెన్‌గా రోహిత్ తనదైన రీతిలో నిర్ణయాలు తీసుకుంటూ ఉంటాడు. ముమ్ముందూ ఇలాగేఉంటే టీమ్ కల్చర్ ప్రతికూలంగా మారుతుందని మేనేజ్‌మెంట్ భావిస్తోంది.

ఫుడ్ పాయిజన్ కాదు.. అలాగైతే భారత క్రికెటర్లూ



### ఇబ్బందిపడాలి కదా?: రాజీవ్ శుక్లా

"ఆటగాడిగా రోహిత్ శర్మ వేరు. నాయకుడిగా పోషించే పాత్ర వేరు. డ్రెస్సింగ్ రూమ్‌లో తనదైన ఫిలాసఫీతో నడిపిస్తాడు. ఇప్పుడు అతడు కేవలం వన్డేల్లోనే ఉన్నాడు. అవి చాలా తక్కువగా జరిగే మ్యాచులు. దీంతో టీమ్‌కల్చర్ డిస్టర్బ్ అయ్యే ప్రమాదం లేకపోలేదు. ఒకరే సారథిగా ఉంటే డ్రెస్సింగ్ రూమ్‌లో మంచి వాతావరణం ఉండే అవకాశం ఉంది. గౌతమ్ గంభీర్ ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన ఆరు నెలల వరకూ జట్టు వెనకుండి నడిపించేవాడు. న్యూజిలాండ్‌తో స్వదేశంలో టెస్టు సిరీస్, ఆస్ట్రేలియా పర్యటనలో ఓటమి చవిచూసిన తర్వాత గంభీర్ ముందడుగు వేశాడు. అప్పటివరకూ టెస్టులు, వన్డేల్లో రోహిత్‌కే ఎక్కువ అవకాశం ఇచ్చిన గంభీర్.. జట్టును తన అధీనంలోకి తీసుకున్నాడు" అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి.

### అలా కోరుకోలేదు..

"విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఇప్పటికే 35ం దాటేశారు. వన్డే ప్రపంచకప్ ఇంకా రెండేళ్ల సమయం ఉంది. ఆలోగా వారిద్దరినీ కాపాడుకోవడంతోపాటు ఫామ్‌లోనూ ఉండటం చాలా ముఖ్యం. గంభీర్ - అజిత్ అగార్కర్ సంయుక్తంగా తీసుకున్న నిర్ణయం ఇది. ఒక్కసారిగా రోహిత్ ఫామ్‌తో ఇబ్బందిపడితే అప్పుడు నాయకత్వం గ్రూప్‌లో అయోమయ పరిస్థితులు రాకూడదని భావించారు" అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి.

# తజ్మిన్ బ్రిట్స్ శతకం

## కివీస్‌పై సఫారీల ఘన విజయం

## మహిళల వన్డే ప్రపంచకప్



ఇండోర్ : మహిళల వన్డే ప్రపంచ కప్‌లో దక్షిణాఫ్రికా తొలి విజయం సాధించింది. సోమవారం న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో సఫారీల జట్టు 6 వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 231 పరుగులకు ఆలౌటైంది. ఈ మోస్తరు లక్ష్యాన్ని సౌతాఫ్రికా 40.5 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ తజ్మిన్ బ్రిట్స్ (101, 89 బంతుల్లో 15 ఫోర్లు, 1 సిక్స్) శతకంతో కదం తొక్కి జట్టుకు అలవోక విజయాన్ని అందించింది. సునే లూస్ (83, 114 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) కూడా మెరిసింది. న్యూజిలాండ్‌కు వరుసగా ఇది రెండో ఓటమి. తొలుత కివీస్ బ్యాటర్లలో కెప్టెన్ సోఫీ డివైన్ (85, 98 బంతుల్లో 9 ఫోర్లు) భారీ ఇన్నింగ్స్‌తో అలరించింది. బ్రూక్ (45, 37 బంతుల్లో 6 ఫోర్లు), జార్జియా ప్లిమ్మర్ (31), అమేలియా కెర్ (23) పరుగులు చేశారు. సుజీ బైట్స్ (0), మ్యా గ్రీన్ (4), ఇసాబెల్లా (10) నిరాశపర్చారు. సౌతాఫ్రికా బౌలర్లలో మ్లాబా 4, మారిజేన్ కాప్, అయబొంగా ఖాకా, నాడిన్ డి క్లెర్క్, క్లోరు ట్రయాన్ ఒక్కో వికెట్ సాధించారు.

# భారత్ శుభారంభం

## ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్స్



గువహటి : బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ జూనియర్ మిక్స్‌డ్ టీమ్ ఛాంపియన్‌షిప్స్‌లో ఆతిథ్య భారత్ శుభారంభం చేసింది. సోమవారం గువహటిలోని నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఆరంభమైన మెగా ఈవెంట్‌లో భారత్ సహా అగ్ర జట్లు బోణీ కొట్టాయి. రెండో సీడ్ భారత్ గ్రూప్-హెచ్‌లో నేపాల్‌పై 45-18, 45-17తో అలవోక విజయం సాధించింది. ఇదే గ్రూప్‌లో హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో యుఏఈపై శ్రీలంక 30-45, 45-34, 45-44తో మెరుపు విజయం ఖాతాలో వేసుకుంది. 14 సార్లు ఛంపియన్, అగ్రజట్టు చైనా వరుస సెట్లలో ఘనాపై అలవోక విజయం సాధించింది. గ్రూప్ దశలో మెరుగైన ప్రదర్శన కనబరిచిన జట్లు నాకౌట్ దశకు చేరుకుంటాయి.
ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్స్‌లో ఈ సారి సరికొత్త రూల్స్ అమలు చేశారు. సాధారణంగా పురుషుల, మహిళల సింగిల్స్, డబుల్స్‌తో పాటు మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచులు టీమ్ ఈవెంట్‌లో ఉంటాయి. కానీ జూనియర్ చాంపియన్‌షిప్స్‌లో బిడబ్ల్యూఎఫ్ పూర్తిగా కొత్త ఫార్మాట్‌ను అమలు చేసింది. ప్రతి విభాగంలో 9 పాయింట్ల చొప్పున కేటాయిస్తూ.. తొలుత ఏ జట్టు 45 పాయింట్లు సాధిస్తుందో ఆ సెట్‌లో వారినే విజేతగా ప్రకటిస్తున్నారు. ప్రతి సెట్‌లో ఆటగాళ్లను మార్పు చేసుకునే వెసులుబాటు సైతం కల్పించటంతో భారత్ అందరినీ బరిలోకి దింపింది.

# అతడు టీమ్‌ఇండియా భవిష్యత్తు..

## 'ధ్రువ్'తార అవుతాడా?!



టీమ్‌ఇండియా ఇటీవల అహ్మదాబాద్ వేదికగా వెస్టిండీస్‌తో రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా జరిగిన మొదటి మ్యాచ్‌లో ధ్రువ్ జురేల్ సెంచరీతో రాణించాడు. భారత జట్టు ఇన్నింగ్స్ 140 పరుగుల తేడాతో ఈ మ్యాచ్‌లో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కరేబియన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 162 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన టీమ్‌ఇండియా 448/5 వద్ద తన తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. తర్వాత తన రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్ టీమ్ 146 పరుగులకే కుప్పకూలింది.

### సత్తా చాటి..

ఈ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా బ్యాటర్లు కేఎల్ రాహుల్ (100బీ 197 బంతుల్లో, 12 ఫోర్లు) ధ్రువ్ జురేల్ (125బీ 210 బంతుల్లో, 15 ఫోర్లు, 3 సిక్స్‌లు), రవీంద్ర జడేజా (104బి, 176 బంతుల్లో, 6 ఫోర్లు, 5 సిక్స్‌లు) సెంచరీలు చేయడం గమనార్హం. ఈ మ్యాచ్‌లో ధ్రువ్ జురేల్ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అతడికి టెస్ట్ కెరీర్‌లో ఇదే తొలి శతకం. రిషభ్ పంత్ స్థానంలో జట్టులోకి వచ్చిన ధ్రువ్ జురేల్.. సూపర్ సెంచరీతో సత్తా చాటాడు. అలాగే ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో వికెట్ కీపర్‌గా నాలుగు క్యాచ్‌లు ఒడిసిపట్టాడు.

### పంత్ గైర్హాజరీలో..

ఇటీవల ఇంగ్లాండ్‌తో అండర్సన్-తెండూల్కర్ ట్రోఫీ సమయంలో రిషభ్‌పంత్ పాదానికి తీవ్ర గాయమైంది. మెడికల్ స్కానింగ్‌లో పంత్ పాదం వద్ద ఎముక విరిగినట్లు తేలడంతో కనీసం ఆరు వారాలు విశ్రాంతి అవసరమని వైద్యబృందం సూచించింది. దీంతో అతడు ఆసియా కప్‌లో పాల్గొనలేదు. ప్రస్తుతం వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్‌లోనూ ఆడటం లేదు. అతడి స్థానంలో వికెట్ కీపర్ బ్యాటర్‌గా ధ్రువ్ జురేల్‌కు సెలెక్టర్లు అవకాశమిచ్చారు.

### పూర్తి ఆత్మవిశ్వాసంతో..

వెస్టిండీస్‌తో జరిగిన మొదటి మ్యాచ్‌లో జురేల్.. పూర్తి ఆత్మవిశ్వాసంతో కనిపించాడు. తన ఇన్నింగ్స్‌లో మూడు అద్భుతమైన సిక్స్‌లు కూడా బాదాడు. ఇటీవలే ఆస్ట్రేలియా-ఎతో మ్యాచ్‌లు ఆడాడు. అవి అతడిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ప్రోత్సాహమూ జురేల్‌ను ముందుకునడిపిస్తున్నాయి.

### తనను తాను సిద్ధం చేసుకుంటూ..

టీమ్‌ఇండియా యువ వికెట్ కీపర్ ధ్రువ్ జురేల్ తనను తాను సిద్ధం చేసుకుంటూ, పక్కా ప్రణాళికతో ముందుకుసాగుతున్నాడు. 'ప్రత్యర్థి జట్టు స్క్వాడ్‌ను పరిశీలించా. అందులో ఎంతమంది సీమర్లు, స్పిన్నర్లు ఉన్నారో గమనించా. వాళ్ల ప్లాన్ ఏమిటా.. అని ఆలోచించా. దానికి తగ్గట్లు నన్ను నేను సిద్ధం చేసుకుంటున్నా. సీనియర్ల విలువైన సలహాలు, సూచనలు తీసుకుంటున్నా. వాళ్ల అనుభవం నాకు మార్గనిర్దేశనం చేస్తోంది' అని ధ్రువ్‌జురేల్ వెస్టిండీస్‌తో మ్యాచ్‌కు ముందు అన్నాడు.

### ఆసీస్ టూర్‌కు ఎంపిక..

అక్టోబర్ 19 నుంచి టీమ్‌ఇండియా ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. ఇందులోభాగంగా మూడు వన్డేలు, అయిదు టీ20లు ఆడనుంది. వన్డే జట్టుకు ధ్రువ్ జురేల్ వికెట్ కీపర్‌గా ఎంపికయ్యాడు. ఆసీస్ గడ్డపై అతడు వన్డేల్లోనూ రాణించి, నిలకడగా పరుగులు రాబట్టగలిగితే, భవిష్యత్తులో టీమ్‌ఇండియా స్టార్ క్రికెటర్‌గానూ ఎదిగే అద్భుత అవకాశముంది.

ధ్రువ్ జురేల్ ఇప్పటివరకు టీమ్‌ఇండియా తరఫున 6 టెస్ట్ మ్యాచ్‌లు ఆడి 47.5 సగటుతో 380 పరుగులు చేశాడు. 4 టీ20ల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. వన్డే క్రికెట్‌లో అతడు ఇంకా అరంగేట్రం చేయాల్సిఉంది. 42 ఐపీఎల్ మ్యాచుల్లో 153.8 స్ట్రైక్ రేట్‌తో 680 పరుగులు చేశాడు.

# ఇప్పటికీ షాక్‌లోనే ఉన్నా.. ధోనీ సలహా పాటిస్తున్నా: సిరాజ్

దాదాపు పది నెలల తర్వాత టీమ్‌ఇండియా స్వదేశంలో టెస్టు ఆడింది. విండీస్‌పై ఘన విజయం సాధించింది. మహ్మద్ సిరాజ్ కీలక పాత్ర పోషించాడు. మొదటి మ్యాచ్‌లో ఏడు వికెట్లు తీశాడు. ఇప్పుడు రెండో టెస్టు కోసం భారత్ సిద్ధమవుతోంది. ఈ క్రమంలో సిరాజ్ ఓ జాతీయ వెబ్‌సైట్‌తో మాట్లాడుతూ.. లార్డ్స్ టెస్టులో ఔటైన తీరు, జస్‌ప్రీత్ బుమ్రా బౌలింగ్‌పై వస్తున్న విమర్శలు, ధోనీ ఇచ్చిన సలహాపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

### ఆ మ్యాచ్ గెలుస్తామని..

"నాకు ఇప్పటికీ అలా ఔట్ కావడం షాకింగ్‌గానే ఉంది. అలా ఎలా జరిగిందో కూడా తెలియలేదు. ఒకసారి పాత వీడియోను గమనిస్తే.. స్టంప్స్ వైపు వెళ్లే క్రమంలో బంతికి చిన్న రాయి ఎదురొచ్చింది. అయినా, పైకి ఎగిరి కరెక్ట్‌గా స్టంప్స్‌ను తాకింది. దీంతో బెయిల్స్ కిందపడ్డాయి. ఆ తర్వాత దీనిపై చాలా రీల్స్ వచ్చాయి. చాలా బాధపడ్డా. ఆ మ్యాచ్‌లో ఓడిపోయినా.. పోరాడిన తీరు మాత్రం ఆకట్టుకుంది. అసలు ఆ మ్యాచ్‌లో ఓడిపోతామని అనుకోలేదు. క్రీజ్‌లో నేను చాలా కంఫర్ట్‌గా ఉన్నా. అస్సలు ఔట్ కాకూడదని నిర్ణయించుకున్నా" అని సిరాజ్ తెలిపాడు. ఇంగ్లాండ్ 193 పరుగులు నిర్దేశించగా.. భారత్ 170 పరుగులకు ఆలౌటైంది. రవీంద్ర జడేజా హాఫ్ సెంచరీతో పోరాడాడు.

### వాళ్ల గురించి ఆలోచించొద్దన్నాడు..

"నేను భారత జట్టులోకి వచ్చిన తర్వాత ధోనీతో మాట్లాడా. అతడు ఇచ్చిన సలహా నాకు ఇప్పటికీ గుర్తుంది. ఎప్పుడూ ఇతరుల చెప్పే మాటలను పట్టించుకోవద్దని సూచించాడు. అద్భుతంగా ఆడినప్పుడు ప్రపంచమంతా మనతోనే ఉంటుంది. ఒక్కసారి మంచి ప్రదర్శన ఇవ్వకపోతే తిడతారు. ఈ మాటలు అక్షర సత్యం. అందుకే, నా ప్రదర్శనపైనే దృష్టి పెడతా. విమర్శలను, పొగడ్తలతనూ పట్టించుకోను. నాకూ ఇలాంటి పరిస్థితులు చాలాసార్లు ఎదురయ్యాయి. ట్రోలింగ్ చేయడం చాలా తప్పు. బాగా వేసినప్పుడు 'సిరాజ్'లాంటి బౌలర్ లేడని ఆకాశానికెత్తేస్తారు. అదే సరిగ్గా ఆడకపోతే 'ఇలాంటి బౌలర్‌ను ఎప్పుడూ చూడలేదు. ఆటో నడిపేందుకు మీ ఫాదర్‌తో వెళ్లు' అన్నవారూ లేకపోలేదు. ఒక మ్యాచ్‌లో హీరో అయిన ప్లేయర్ మరొక మ్యాచ్‌లో జీరో అవుతాడు. ప్రజలు చాలా త్వరగా తమ అభిప్రాయాలను మార్చేసుకుంటారు. జట్టు సహచరులు, కుటుంబ సభ్యులు



ఏమనుకుంటున్నారనేదే ముఖ్యం" అని సిరాజ్ అన్నాడు.

### బుమ్రాపై విమర్శలు సరికాదు

"నేను ఎలా బయట నుంచి వచ్చే వ్యాఖ్యలను పట్టించుకోనో.. బుమ్రా కూడా అలానే ఉంటాడు. అతడు చాలా సీరియస్ వెన్ను నొప్పితో బాధపడ్డాడు. పెద్ద సర్జరీ కూడా అయింది. అయినా సరే ఇంగ్లాండ్ పర్యటనలో బౌలింగ్ చేశాడు. అవేవీ పట్టనట్లుగా విమర్శలు చేసేస్తారు. ఒకవేళ ఆ సమయంలో అతడు గాయపడితే చాలా ప్రమాదకర పరిస్థితి ఎదుర్కొనేవాడు. బుమ్రా బౌలింగ్ యాక్షన్ విభిన్నమైంది. భారత జట్టుకు చాలా కీలకమైన బౌలర్. వచ్చే ఏడాది పొట్టి కప్ ఉంది. ఆ తర్వాత 2027లో వన్డే ప్రపంచ కప్, ఆసియా కప్.. ఇలా మెగా టోర్నీల్లో ఆడాల్సి ఉంది. అందుకే, భారత క్రికెట్ అభిమానులు అర్థం చేసుకోవాలని కోరుతున్నా. విశ్రాంతి ఎలా తీసుకుంటాడో.. జట్టుకు అవసరమైనప్పుడు బౌలింగ్ చేయడానికి సిద్ధంగా ఉంటాడు. అలాంటి విషయాల్లో సరైన నిర్ణయమే తీసుకుంటాడు" అని సిరాజ్ తెలిపాడు.

తెలుగురాష్ట్రం దినపత్రిక



# తాజా చిత్రంపై రష్మిక పోస్ట్ వైరల్

**విజయ్ దేవరకొండతో రష్మిక నిశ్చితార్థం అంటూ జోరుగా ప్రచారం**

**పుకార్లపై స్పందించకుండా తన సినిమా అప్‌డేట్ ఇచ్చిన రష్మిక**

**'థామా' సినిమా కోసం ప్లాన్ లేకుండానే పాట చిత్రీకరించామని వెల్లడి**

టాలీవుడ్ క్రేజీ జంటగా పేరుతెచ్చుకున్న విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న నిశ్చితార్థం చేసుకున్నారనే వార్త సోషల్ మీడియాలో పెద్ద దుమారాన్నే రేపుతోంది. గత రెండు రోజులుగా ఈ ప్రచారం జోరుగా సాగుతున్నా, దీనిపై ఇటు విజయ్ గానీ, అటు రష్మిక గానీ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. ఈ ఊహాగానాల మధ్య రష్మిక పెట్టిన ఓ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న పుకార్లను పక్కనపెట్టి, ఆమె తన వృత్తిపరమైన పనులపైనే దృష్టి పెట్టినట్లు ఈ పోస్ట్ స్పష్టం చేస్తోంది. తన కొత్త హిందీ చిత్రం 'థామా' షఉటింగ్ సందర్భంగా జరిగిన ఓ ఆసక్తికర విషయాన్ని ఆమె అభిమానులతో పంచుకున్నారు. సుమారు 12 రోజుల పాటు ఓ అందమైన లొకేషన్‌లో సినిమా షఉటింగ్ జరిపామని, చివరి రోజున దర్శకులు, నిర్మాతలకు అప్పటికప్పుడు ఓ ఆలోచన వచ్చిందని రష్మిక తన పోస్ట్‌లో పేర్కొన్నారు. "అదే ప్రదేశంలో ఓ పాటను ఎందుకు చిత్రీకరించకూడదు అని వాళ్లు అనుకున్నారు. ఆ ఆలోచన, లొకేషన్ అందరికీ నచ్చడంతో వెంటనే పని మొదలుపెట్టాం" అని ఆమె తెలిపారు. మూడు, నాలుగు రోజుల పాటు రిహార్సల్స్ చేసి పాటను పూర్తి చేశామని రష్మిక వివరించారు. "అనుకోకుండా తీసుకున్న నిర్ణయమైనా, ముందుగా ప్లాన్ చేసుకున్న వాటికంటే ఈ పాట అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చింది. పాట చూసి మేమంతా ఆశ్చర్యపోయాం. ఈ పాట కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. థియేటర్లలో మీరంతా ఈ పాటను తప్పకుండా ఎంజాయ్ చేస్తారు" అని ఆమె రాసుకొచ్చారు. ప్రస్తుతం రష్మిక 'థామా' అనే హారర్ చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా హీరోగా నటిస్తుండగా, ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా షఉటింగ్ వేగంగా జరుగుతోందని, అక్టోబర్ 21న ప్రేక్షకుల ముందుకు రానుందని సమాచారం. తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న పుకార్లపై మౌనంగా ఉంటూ, కెరీర్‌పైనే పూర్తి దృష్టి పెట్టినట్లు రష్మిక తాజా పోస్ట్ ద్వారా స్పష్టమవుతోందని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు.

# 'బ్యాడ్ బాయ్ కార్తీక్' టీజర్ విడుదల



నాగ శౌర్య ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'బ్యాడ్ బాయ్కార్తీక్'. తాజాగా ఈ చిత్రం నుండి టీజర్‌ను విడుదల చేశారు. హరీష్ జైరాజ్ సంగీతం అందించారు. ఈ చిత్రానికి రామ్ దేసిన దర్శకత్వం వహిస్తున్నారు. విధి ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. వైష్ణవి ఫిల్మ్స్ బ్యానర్‌పై నిర్మాణం జరుపుతున్న ఈ చిత్రం, ఆ బ్యానర్ నుంచి వస్తున్న తొలి సినిమా. త్వరలోనే ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

# డిసెంబరు 25న 'ఛాంపియన్'




రోషన్ హీరోగా ప్రదీప్ అద్వైతం డైరెక్ట్ చేస్తున్న మూవీ 'ఛాంపియన్'. తాజాగా ఈ చిత్రం విడుదలతేదీ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్స్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ సంస్థలు సంయుక్తంగా ఈ సినిమాని నిర్మిస్తున్నాయి. పీరియాడికల్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాను క్రిస్టమస్ సందర్భంగా డిసెంబర్ 25న విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు.



# బాలీవుడ్‌లో శ్రీలీలకు మరో బంపర్ ఆఫర్

**బాలీవుడ్‌లో రెండో ఆఫర్ కొట్టేసిన శ్రీలీల - కరణ్ జోహార్ మూవీలో శ్రీలీలకు ఛాన్స్**

**ఇప్పటికే కార్తిక్ ఆర్యన్ మూవీలో నటిస్తున్న శ్రీలీల**

టాలీవుడ్‌లో తన అందం, అభినయంతో పాటు చలాకీతనంతో యువతను ఆకట్టుకుంటున్న శ్రీలీల, ఇప్పుడు బాలీవుడ్ వైపు తన అడుగులు వేగవంతం చేస్తోంది. ఇప్పటికే ఒక హిందీ సినిమాలో నటిస్తున్న శ్రీలీల... ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌లో నటించే అవకాశం దక్కించుకున్నట్లు గట్టిగా ప్రచారం జరుగుతోంది. వివరాల్లోకి వెళ్తే, ప్రముఖ నిర్మాత కరణ్ జొహార్ నిర్మిస్తున్న 'దోస్తానా 2' సినిమాలో శ్రీలీలను హీరోయిన్‌గా దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం. ఈ చిత్రంలో నేషనల్ అవార్డు గ్రహీత విక్రాంత్ మాస్సే హీరోగా నటిస్తున్నారు. వాస్తవానికి, ఈ పాత్ర కోసం ముందుగా జాన్వీ కపూర్‌ను ఎంపిక చేసినప్పటికీ, కొన్ని కారణాల వల్ల ఆమె ఈ ప్రాజెక్ట్ నుంచి వైదొలిగారు. దీంతో ఆ అద్భుత అవకాశం శ్రీలీలను వరించినట్టు బాలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం దీనిపై నిర్మాత కరణ్ జొహార్ తుది చర్చలు జరుపుతున్నారని, త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే శ్రీలీల, బాలీవుడ్ యంగ్ స్టార్ కార్తిక్ ఆర్యన్ సరసన ఒక సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆ సినిమా సెట్స్‌పై ఉండగానే ఇప్పుడు రెండో అవకాశం కూడా ఆమె తలుపు తట్టడంతో, బాలీవుడ్‌లో శ్రీలీల కెరీర్ దూసుకుపోవడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఒకదాని తర్వాత ఒకటిగా రెండు పెద్ద ప్రాజెక్టులలో అవకాశాలు రావడంతో, శ్రీలీల బాలీవుడ్‌లో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోవడం ఖాయమని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

# 'కాంతార 1' కలెక్షన్ల సునామీ..

## 'హనుమాన్', 'కేజీఎఫ్ 1' రికార్డులు బ్రేక్!

**బాక్సాఫీస్ వద్ద కాంతార చాప్టర్ 1 కలెక్షన్ల సునామీ**

**నాలుగు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ. 325 కోట్ల గ్రాస్ వసూళ్లు**

**ఈ ఏడాది రూ. 300 కోట్లు దాటిన తొలి కన్నడ సినిమాగా రికార్డ్**

**దేశీయంగా రూ. 223 కోట్లకు పైగా నెట్ వసూళ్లు సాధించిన చిత్రం**



రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో నటించిన 'కాంతార చాప్టర్ 1' చిత్రం బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టిస్తోంది. విడుదలైన కేవలం నాలుగు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 325 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది. ఈ క్రమంలో ఈ ఏడాది బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'హనుమాన్' చిత్రంతో పాటు కన్నడ ఇండస్ట్రీ హిట్టయిన 'కేజీఎఫ్ చాప్టర్ 1' లైఫ్‌టైమ్ కలెక్షన్లను కూడా అధిగమించి సరికొత్త రికార్డులను నెలకొల్పింది. విడుదలైన మొదటి రోజు నుంచే భారీ వసూళ్లతో దూసుకెళ్తున్న ఈ సినిమా, ఆదివారం ఒక్కరోజే దేశీయంగా ఏకంగా రూ. 61 కోట్ల నెట్ వసూళ్లను రాబట్టింది. దీంతో నాలుగు రోజుల లాంగ్ వీకెండ్ ముగిసేసరికి భారత్‌లో ఈ చిత్రం మొత్తం రూ. 223.25 కోట్ల నెట్ (రూ. 268 కోట్ల గ్రాస్) కలెక్షన్లను నమోదు చేసింది. ఇది 'కేజీఎఫ్ చాప్టర్ 2' తర్వాత కన్నడ సినీ చరిత్రలోనే రెండో అతిపెద్ద ఓపెనింగ్ వీకెండ్ కావడం విశేషం. అటు ఓవర్సీస్‌లోనూ 'కాంతార 1' హవా కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లలో ఈ చిత్రం ఇప్పటికే 6 మిలియన్ డాలర్లకు పైగా వసూలు చేసినట్లు ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. ఈ సినిమా తన జైత్రయాత్రలో పలు కీలక చిత్రాల రికార్డులను వెనక్కి నెట్టింది. ప్రపంచవ్యాప్తంగా రూ. 298 కోట్లు వసూలు చేసిన 'హనుమాన్', రూ. 248 కోట్లు సాధించిన 'కేజీఎఫ్ చాప్టర్ 1' చిత్రాల లైఫ్‌టైమ్ గ్రాస్‌ను కేవలం నాలుగు రోజుల్లోనే దాటేసింది. దీంతో 'కేజీఎఫ్ చాప్టర్ 2', 'కాంతార' (మొదటి భాగం) తర్వాత అత్యధిక వసూళ్లు సాధించిన మూడో కన్నడ చిత్రంగా నిలిచింది. ఇదే జోరు కొనసాగితే మొదటి వారంలోనే 'కాంతార' మొదటి భాగం (రూ. 400 కోట్లు) రికార్డును కూడా బద్దలు కొట్టే అవకాశం ఉంది. ఈ ఏడాది వెయ్యి కోట్ల క్లబ్‌లో చేరే తొలి భారతీయ చిత్రంగా నిలిచే సత్తా ఈ సినిమాకు ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. 2022లో సంచలనం సృష్టించిన 'కాంతార'కు ప్రీక్వెల్‌గా ఈ చిత్రం తెరకెక్కింది. రిషబ్ శెట్టి దర్శకత్వం వహించి ప్రధాన పాత్రలో నటించగా, రుక్మిణి వసంత్, జయరాం, గుల్షన్ దేవయ్య కీలక పాత్రలు పోషించారు. విమర్శకుల నుంచి, ప్రేక్షకుల నుంచి ఈ చిత్రానికి అద్భుతమైన ప్రశంసలు లభిస్తున్నాయి.

# నాగార్జున 100వ చిత్రం 'లాటరీ కింగ్'!

నాగార్జున ప్రస్తుతం తన 100వ చిత్రం కోసం సిద్ధం అవుతున్నారు. తమిళ దర్శకుడు కార్తీక్ ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. యాక్షన్ అండ్ కామెడీ ఎంటర్‌టైనింగ్ మూవీగా రాబోతున్న ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తోంది. ఈ మూవీకి 'లాటరీకింగ్' అన్టే టైటిల్ ఫిక్స్ అయినట్లు సమాచారం.



# సినీ నటి సయామీ సాహసం..

## ఏడాది తిరిగేలోపే రెండోసారి 'ఐరన్‌మ్యాన్' పూర్తి

**ఇది రికార్డుల కోసం కాదని, స్వీయసవాల్ కోసమేనని వెల్లడి**

**ఈ రేసు ఒక జీవన విధానమని, పట్టుదలకు ప్రతీక అని వ్యాఖ్య**

**ముఖ్యంగా మహిళలకు స్ఫూర్తినివ్వడమే తన లక్ష్యమన్న సయామీ**

**ఐరన్‌మ్యాన్ ఇండియాకు ప్రచారకర్తగా వ్యవహరిస్తున్న నటి**

సినీ నటి సయామీ ఖేర్ అరుదైన ఘనత సాధించారు. ప్రపంచంలోనే అత్యంత కఠినమైన పోటీల్లో ఒకటైన 'ఐరన్‌మ్యాన్ 70.3' ట్రయాథ్లాన్‌ను ఏడాది తిరిగేలోపే రెండుసార్లు పూర్తి చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. 2024 సెప్టెంబర్‌లో మొదటిసారి, 2025 జులైలో రెండోసారి ఆమె ఈ రేసును విజయవంతంగా ముగించారు. అయితే, తాను ఈ పోటీలో పాల్గొన్నది రికార్డుల కోసం కాదని, తన సామర్థ్యాన్ని పరీక్షించుకోవడం కోసమేనని సయామీ స్పష్టం చేశారు. ఐరన్‌మ్యాన్ 70.3 ట్రయాథ్లాన్ అంటే మాటలు కాదు. ఇందులో పాల్గొనేవారు ఒకే రోజు వరుసగా 1.9 కిలోమీటర్లు ఈత కొట్టాలి, 90 కిలోమీటర్లు సైకిల్ తొక్కాలి, ఆ తర్వాత 21.1 కిలోమీటర్లు పరుగు పెట్టాలి. ఇంతటి కఠినమైన రేసును పూర్తి చేయడానికి అసాధారణమైన శారీరక, మానసిక స్థైర్యం అవసరం. ఈ సందర్భంగా సయామీ ఖేర్ మాట్లాడుతూ... "ఐరన్‌మ్యాన్ ఇండియాకు ప్రచారకర్తగా ఉండటం నాకు దక్కిన గౌరవం. అభిరుచి, నిలకడ, వదిలిపెట్టని పట్టుదల వంటి నేను నమ్మే విలువలన్నిటికీ ఈ ప్రయాణం ఒక ప్రతీక. ఏడాదిలో రెండుసార్లు ఈ రేసును పూర్తిచేయడం రికార్డుల కోసం కాదు, నా పరిమితులను నేను సవాలు చేసుకోవడం కోసం చేశాను" అని తెలిపారు. "ఈత కొట్టే ప్రతిసారి, సైకిల్‌పై ఎత్తుకు వెళ్తున్నప్పుడు, పరుగులో వేసే ప్రతి అడుగు.. మనిషి శరీరం, మనసు ఎంత శక్తిమంతమైనవో నాకు గుర్తు చేశాయి. నాకు ఐరన్‌మ్యాన్ అంటే కేవలం ఒక రేసు కాదు, అదొక జీవన విధానం. క్రీడల్లో అయినా, నటనలో అయినా ఎల్లప్పుడూ నా హద్దులను చెరిపేయడానికి ప్రయత్నిస్తాను. నా ప్రయాణం మరింత మంది భారతీయులకు, ముఖ్యంగా మహిళలకు స్ఫూర్తినిస్తుందని ఆశిస్తున్నాను" అని సయామీ అన్నారు. ఇక సినిమాల విషయానికొస్తే, సయామీ ఖేర్ ఇటీవల 'స్పెషల్ ఆప్స్ 2' వెబ్ సిరీస్‌లో కీలక పాత్రలో కనిపించారు. కేకే మేనన్ ప్రధాన పాత్ర పోషించిన ఈ సిరీస్‌లో ఆమె నటనకు మంచి ప్రశంసలు దక్కాయి.



TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339